


# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక

21st ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం





బుధవారం 25-02-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 21 సంచిక : 281 రూ॥ 6.00








# ఘనంగా చేరికలు... ఘోరంగా ఓటములు!




చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888


## గొప్పలు చెప్పుకున్నా.. గెలుపులు గుండు సున్నా?

- ఎన్నికల కోసం సవాళ్లు..అన్నింటా అపజయాలు?
- ఈ రెండేళ్ల కాలంలో లక్షల మంది బీఆర్ఎస్ లో చేరారు?
- కేటీఆర్, హరీష్ లు ఎక్కడికెళ్లినా చేరికల జాతరలు సాగిస్తున్నారు.
- ఇరామ్ లేకుండా వారంలో రొండుసార్లైనా తెలంగాణా భవన్లో వేలాది మందికి కండువాలు కప్పుతూనే వున్నారు.
- జిల్లాలలో ఎక్కడికెళ్లినా ఇదే కండువాలు కప్పని ప్రోగ్రామే ఉండడం లేదు!
- అధికారంలో వున్న పదేళ్ల ప్రతి చోట కప్పుకుంటూనే పోయారు.
- సభలు, సమావేశాలలో కండువాలు గొప్పగా కప్పుతున్నారు!
- ఎన్నికల సమయంలో కుప్పలు తెప్పలుగా పార్టీలో చేరుతున్నారు?
- బీఆర్ఎస్ లో చేరిన వాళ్లంతా ఎవరికి ఓట్లేస్తున్నారు?
- బీఆర్ఎస్ అభ్యర్థులు అంతటా ఎందుకు ఓడిపోతున్నారు?
- కండువాలు కప్పే ప్రచారమంతా తూతు మంత్రమేనా
- చేరికలన్నీ అబద్దమా? కప్పే కండువాలు కల్పితమా?
- ఎవరిని మోసం చేస్తున్నారు? మీకు మీరే మోసం చేసుకుంటున్నారు?
- తెలంగాణా లో ఐదేళ్ల క్రితమే 60 లక్షల మంది కార్యకర్తలు వున్నారని చెప్పారు?
- ఈ ఐదేళ్ల కాలంలో కొన్ని లక్షల మందికి కండువాలు కప్పారు?
- ఆ ఓట్లన్నీ ఎవరికి పోతున్నాయి? బీఆర్ఎస్ కు ఓటములే ఎందుకు మిగులుతున్నాయి?
- ఈ రెండేళ్లలో గర్వంగా గెలిచామని చెప్పుకునే ఫలితాలు చూసారా?
- పార్లమెంట్ ఎన్నికల్లో అంత తిరస్కారం ఎందుకొచ్చింది అని సమీక్షించు కున్నారా?
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం చేశారా?
- పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలలో బొక్క బోర్లా మళ్ళీ పడ్డారా?
- అయినా పార్టీ లో అంతర్ మదనం జరుగుతోందా?
- నాయకులకు, కార్యకర్తలకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేసుకున్నారా?
- అసలు పార్టీ కార్యకర్తలకు గౌరవం ఉందా?
- రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి కమిటీలు ఉన్నాయా?
- పార్టీ లో అంతర్గత ప్రజాస్వామ్యం వుందా?

**హైదరాబాద్, నేటిధాత్రి:**

కొన్ని ప్రశ్నలకు సమధానం వుండదు అంటుంటారు. అంటే తప్పించుకోవాలనుకున్నప్పుడో, తప్పించుకోలేని పరిస్దితుల్లో అందరూ చెప్పే ఏకైక సమాదానం ఇది. నిజానికి సమాదానం లేని ప్రశ్నలు ఈ ప్రపంచంలోనే వుండవు. వుంటే అవి ప్రశ్నలే కావు. బిఆర్ఎస్ రాజకీయాలు కూడా అలాగే వుంటున్నాయి. పార్టీ అభిమానులు కూడా జీర్ణించుకోలేనంత ఇబ్బందికరంగా వుంటున్నాయి. బిఆర్ఎస్ వరస ఓటములను ఎందుకు చవి చూస్తోందన్నదానిపై ఇప్పటికీ ఆ పార్టీలో ఎవరికీ క్లారిటీ లేదు. సమాదానం చెప్పుకోవడానికి కూడా ఏమీ లేదు. అదికారంలో వున్నప్పుడు ఏది చేసినా సాగుతుంది. ప్రతిపక్షంలో వున్నప్పుడు కొట్లాడిందే ఎక్కడైనా లెక్కకొస్తుంది. ఈ విషయం బి ఆర్ఎస్ నాయకులకు ఒంట బట్టడంలేదు. ఎంత సేపు సులువుగా జనం ఆదరిస్తే బాగుండు అనుకుంటున్నారు. పైగా వచ్చేది మేమే అని కలలు కంటూ వున్నారు. అదికారంలోవున్నప్పుడు అలాగే అనుకున్నారు. ఓడిపోయారు. ఇప్పుడూ అలాగే అనుకుంటున్నారు ఓడిపోతున్నారు. కాని పోరాటం చేద్దామన్న సోయి లేదు. పోరాటం చేసి జనం మనసు చూరగొంటామన్న ముందడుగు లేదు. దేనికైనా కాలమే సమాదానం చెబుతుందనే దోరణిలో వెళ్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మీద వున్న వ్యతిరేకతతో గెలుస్తామని అనుకుంటున్నారు. పోరాటం చేయడంలో బిఆర్ఎస్‌ను మించిన పార్టీ మరొకటి లేదంటారు. ఉద్యమాలు చేయడానికి మాత్రం ముందుకు రావడం లేదు. గతంలో అనేకం చేశాం..తెలంగాణ తెచ్చామని పదే పదే చెబుతుంటే ఈ తరం యువతరం వింటుందే గాని అయితే ఏంటి? అనే ప్రశ్నలు పుట్టుకొస్తున్నాయి. అప్పుడు బిఆర్ఎస్‌కు తెలంగాణ సమాజమంతా తోడుంది. అందుకే బిఆర్ఎస్ ఏది చేసినా అప్పటి పాలకులు భయపడ్డారు. ఇప్పుడు స్వరాష్ట్రం. తెలంగాణ సమాజమంతా బిఆర్ఎస్ వెంట ఇప్పుడు లేరు. వుంటే ఆ పార్టీకి గత ఎన్నికల్లో ఓటమే వుండేది కాదు. ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యమ కాలం వేరు. స్వరాష్ట్రంలో పోరాటం వేరు. బిఆర్ఎస్ పోరాటానికి ప్రజలు తోడు రావాలని కోరుకోవడం తప్పు కాదు. కాని ప్రజల కోసం కొట్లాడాలనుకున్నప్పుడు ప్రజలను ఆకర్షించాలి. తెలంగాణ కోసం కొట్లాడినప్పుడు కేసిఆర్ ఒక్కరే. ఇప్పుడు కూడా బిఆర్ఎస్ ఒక్కటే అనుకొని ముందుకు సాగాలి. అంతే తప్ప జనం తోడు రావడం లేదంటే కుదరదు. బిఆర్ఎస్ మీద పోరాటం చేసిన కాంగ్రెస్ పార్టీకి కూడా ముందు అంతా శూన్యమే. పదేళు కొట్లాడితే జనం ఆదరించారు. బిఆర్ఎస్ పాలన వద్దనకున్నారు. మార్పు కోరుకున్నారు. కాంగ్రెస్ మాటలు బలంగా నమ్మారు. అలా బిఆర్ఎస్‌ను మించిన నమ్మకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రజలకు కలిగించింది. ఇప్పుడు సరిగ్గా బిఆర్ఎస్ కూడా అదే చేస్తే సరిపోతుంది. కాని ఏం చేస్తుంది. ఆరు గ్యారెంటీలు ఇచ్చి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి, సిఎం. రేవంత్ రెడ్డి సర్కారు మొదలై రెండున్నరేళ్లు గడుస్తోంది. అయినా బిఆర్ఎస్ కదలడం లేదు. కాంగ్రెస్ పార్టీ అదికారంలోకి వచ్చిన వెంటనే ఆవేశపడ్డారు. అడ్డం పడ్డారు. ఇప్పుడు ఎగిరేందుకు ఎదురు చూస్తున్నారు. ఇంకా కాలం కావాలన్నట్లు మాట్లాడుతున్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ వరుసగా ఎన్నికల్లో గెలుస్తూ వస్తోంది. బిఆర్ఎస్ వరుస ఓటములను తన ఖాతాలో వేసుకుంటూనే వుంటుంది. పైగా పదే పదే ఎన్నికలకు సై అంటూ సవాళ్ల మీద సవాళ్లు చేస్తూ పోతోంది. అదేంటో పార్టీలో చేరికల మీద వున్న శ్రద్ద బిఆర్ఎస్‌కు పోరాటాల మీద లేకుండా పోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే కవిత చెబుతున్న మాట కూడా ఇదే. మాటలు కోటలు దాటిస్తున్నారు. కాళ్లు తంగెళ్లు దాటడం లేదన్న మాటలే సర్వత్రా వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులను గడప దాటనీయకుండా ఎన్ని నిర్బంధాలకు గురి చేసినా వారు తెగించి పోరాటాలు చేశారు. అబద్దాలు ప్రచారం చేశారో నిజం ప్రచారం చేశారో జనం విశ్వాసం చూరగొన్నారు. వారు చెప్పిన మాటలు జనం చేత నిజమని నమ్మించారు. బిఆర్ఎస్‌ను ఓడించారు. అబద్దాలు చెప్పి కాంగ్రెస్ గెలిచిందని చెప్పడానికి కూడా ధైర్యం లేనట్లు, ఆరు గ్యారెంటీల మీద పోరాటం చేసే శక్తి లేనట్లు బిఆర్ఎస్‌నేతల వ్యవహారశైలియే జనం నమ్మకాలను చేరడం లేదు. కాని చేరికల సంబరాలు ఏ పార్టీకి లేనంతగా బిఆర్ఎస్‌లో నిత్య సంతర్పణంలాగా కార్యకర్తలు చేరుతూనే వుంటారు. అటు కేటిఆర్, ఇటు హరీష్‌రావు, ఇతర నాయకుల సమక్షంలో ఈ రెండేళ్ల కాలంలో మొత్తం మీద లక్షలాది మంది కార్యకర్తలు చేరి వుంటారు. రెండేళ్ల కింద బిఆర్ఎస్ ఓడిపోయిన తర్వాత కొంత మందగనం కనిపించింది. సరిగ్గా పార్లమెంటు ఎన్నికల ముందు మళ్లీ పెద్దఎత్తున జోష్ కనిపించింది. ఎక్కడిక్కడ నాయకులు,కార్యకర్తలు చేరినట్లు కనిపించింది. పార్లమెంటు ఎన్నికల సమయంలో తెలంగాణ భవన్‌లో చేరికలతోటి నిత్యం సంబరాలే కనిపించాయి. కాని ఏమైంది. పార్లమెంటు ఎన్నికల్లో తుస్సు మంది. ఏకంగా కేసిఆర్ బస్సు యాత్ర పెట్టుకొని మరీ తిరిగారు. కాలు బాగాలేకున్నా ఊరూరు చుట్టివచ్చినంత పని చేశారు. రైతులను చైతన్యం చేశారు. నల్లగొండలో సభ నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికల వేళ పొలాలు తిరిగారు. ఎండిన పొలాలను చూశారు. పాలకుర్తి కూడా కేసిఆర్ పొలాల పొంటి తిరిగారు. కేసిఆర్‌ను చూడడానికి వచ్చిన జనాన్ని చూసి మళ్లీ బిఆర్ఎస్ పుంజుకున్నది అనుకున్నారు. కాని ఓట్లు పడలేదు. సీట్లు రాలేదు. కొన్ని చోట్ల కనీసం డిపాజిట్లు రాలేదు. కారణం ఎవరికీ అర్దం కాలేదు. అంటే వచ్చిన వాళ్లంతా ఎవరు? నాయకులు తీసుకొచ్చిన వాళ్లనేది అర్దమైంది. ప్రజలను తెచ్చుకొని ప్రచారం చేసుకుంటే ఓట్లు పడవని అర్దమైంది. తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికలయ్యాయి. ఆ ఎన్నికలలో పోటీ చేసేందుకు కూడా జంకినంత పని చేశారు. పోటీ చేయడానికి కూడా ధైర్యం చేయలేదు. కేసిఆర్ వ్యూహాలు రచిస్తున్నారు. అంటూ పులి వస్తుందని చెప్పారు. కాని ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఇక తర్వాత చాల కాలం పాటు రాజకీయాలు లేకుండాపోయాయి. అయినా తెలంగాణ భవన్‌లో మాత్రం సందడి తగ్గలేదు. అప్పుడప్పుడూ చేరికలు నిర్వహిస్తూనే వస్తున్నారు. ఏది ఆగినా చేరికలు ఆగలేదు. ఆ సంబరాలు ఆగలేదు. వేడుకలు చేసుకోకుండా ఊరుకోలేదు. ఇక జూబ్లీ హిల్స్ ఎన్నికల సమయంలో బిఆర్ఎస్ చేసిన హడావుడి అంతా ఇంత కాదు. మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చనిపోయి మరునాటి నుంచే బిఆర్ఎస్ రాజకీయాలు మొదలుపెట్టింది. ప్రచారం ఆ సమయంలోనే చుట్టడం ప్రారంభించింది. సిట్టింగ్ సీటు మనదే అనుకున్నారు. బిఆర్ఎస్ ఊపుకు ఆ ఎన్నిక తోడ్పతుందనుకున్నారు. గోపీనాథ్ సతీమణిని కాలనీలన్నీ తిప్పారు. ఎక్కడికక్కడ సభలు ఏర్పాటు చేశారు. పెద్దఎత్తున చేరికలు చేశారు. కాస్తో కూస్తో పెద్ద నాయకులైతే తెలంగాణ భవన్‌లో చేరికలు చేపట్టారు. తీరా జూబ్లీ ఉప పోలింగ్ సమయం దగ్గరికొచ్చే సరికి బిఆర్ఎస్ చేసిన హడావుడి అ ంతా ఇంతా కాదు. ఇక గెలిచినట్లే అనుకున్నారు. కార్నర్ మీటింగ్‌లు అంటూ పెట్టిన సభలు అందర్నీ ఆశ్చర్యపర్చాయి. అంతకు ముందు గణేష్ నిమజ్జన సమయంలో ట్యాంక్ బండ్ మీద యువత చేసిన హంగామా చూసి బిఆర్ఎస్ నాయకులు మురిసిపోయారు. యువత కూడా బిఆర్ఎస్ వైపే నిలుస్తుందని సంబరపడ్డారు. దేఖ్‌లేంగే అంటూ పాడే పాటలను చూసి బిఆర్ఎస్ నాయకులు ఇక పాత రోజులు వచ్చినట్లే అని సంబరాలు చేసుకున్నారు. కాని ఏమైంది. జూబ్లీ కూడా బిఆర్ఎస్ కోల్పోయింది. అటు పార్టీ మారిన ఎమ్మెల్యేలు, ఇటు వరుస ఓటములతో బిఆర్ఎస్ నానాటికి కుదేలౌతూ వస్తోంది. పంచాయతీ ఎన్నికలు పెట్టండి? పెట్టండి? అంటూ పదే పదే డిమాండ్ చేసిన బిఆర్ఎస్ నాయకులు ఒక్కసారిగా జూబ్లీ ఫలితంతో చల్లబడిపోయారు. తెలంగాణలో బిఆర్ఎస్ పుంజుకోలేదన్నది తేలిపోయింది. అంతకు ముందు నిజంగానే కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలంటే ఒకింత భయపడింది. జూబ్లీ గెలవడంతో బిఆర్ఎస్ మీద జనంలో ఇంకా కోపం వుందన్న సంగతి సిఎం. రేవంత్‌రెడ్డికి అర్ధమైంది. వెంటనే పంచాయితీ ఎన్నికలు నిర్వహించారు. మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ గెల్చుకున్నది. దాంతో సిఎం. రేవంత్ రెడ్డికి మరింత నమ్మకం ఏర్పడింది. ఆ వేడిలోనే మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తే సరిపోతుందని అనుకున్నారు. పంచాయితీ ఎన్నికలతో కాంగ్రెస్‌లో జోష్ పెరిగింది. నాయకులకు పదవుల మీద ఆశ పెరిగింది. దాంతో విపరీతంగా పోటీ కూడా పెరిగింది. మున్సిపల్ ఎన్నికలు కూడా జరిగిపోయాయి. అయితే కాంగ్రెస్‌లో ఎక్కడా పెద్దగాచేరికలు లేవు. బిఆర్ఎస్‌తో పోల్చితే చేరికలు కాంగ్రెస్‌లోకి చాలా తక్కువ. కాని ఓట్లేమో కాంగ్రెస్‌కు పడుతున్నాయి. చేరికల మీద చేరికలు జరుగుతున్న బిఆర్ఎస్‌కు వరస ఓటములు పలకరిస్తున్నాయి?

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి



21st ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం


నిష్పాక్షికమైన నిర్భయ నినాదం

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక



బుధవారం 25-02-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 21 సంచిక : 281 రూ॥ 6.00






# తగ్గేదే లేదన్న స్థితిలో బీఆర్ఎస్


| | అసెంబ్లీ (2023) | పార్లమెంట్ (2024) | మున్సిపల్ (2026) |
|---|---|---|---|
| బీఆర్ఎస్ | 37.35% | 16.68% | 28.75% |
| కాంగ్రెస్ | 39.40% | 40.10% | 39.80% |
| బీజేపీ | 13.90% | 35.19% | 15.67% |
| ఇతరులు | 9.35% | 8.03% | 15.78% |

వివిధ పార్టీల ఓట్ల శాతాలు

## కాంగ్రెస్ పెద్దలు జాగ్రత్త పడకపోతే పుట్టిమునిగే ప్రమాదం




- కేవలం 50కంటే ఎక్కువ స్థానాల్లో గెలవడం ప్రజల పూర్తి మద్దతుకు సంకేతం కాదు
- 38 మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడటం విపక్ష బలానికి సంకేతం
- నెంబర్ గేమ్ కాదు "ఓటింగ్ శాతం" ముఖ్యం
- రానున్న కాలం కాంగ్రెస్‌కు టైట్ రోప్ వాక్ అనే చెప్పాలి
- రేవంత్ సహా మంత్రులు హైకమాండ్ భజన తగ్గించుకోవాలి
- ఇది ప్రజల్లో వ్యతిరేకతను పెంచుతుంది
- అధికారంలోకి వస్తేనే కదా హైకమాండ్ పెత్తనం
- ఓడిపోతే హైకమాండ్ పట్టించుకోదు
- ప్రజలే హైకమాండ్ అని గుర్తించి ప్రభుత్వం పనిచేయాలి
- ఇందిరమ్మ భజన "తెలంగాణ ఆత్మగౌరవం" నినాదానికి దారితీస్తుంది



## • అధికారం ఇచ్చేది ప్రజలు మాత్రమే

**హైదరాబాద్, నేటిధాత్రి:**

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ 1537 వార్డుల్లో విజయం సాధించినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే బీఆర్ఎస్ చెక్కుచెదరలేదని స్పష్టంగా తెలుస్తోంది. ఇక్కడ తెలంగాణ ఆత్మగౌరవం కంటే రేవంత్ ప్రభుత్వంలో నెలకొన్న అవినీతిపై బీఆర్ఎస్ చేసిన విస్తృత ప్ర చారం ఏస్థాయిలో పనిచేసిందో మనకు చాలా అర్థమవుతుంది. ఇక్కడ గుర్తించాల్సిన అంశ మేమంటే కాంగ్రెస్ 1537 వార్డుల్లో గెలిచినా, 1200 నుంచి 1400 వార్డుల్లో బీఆర్ఎస్ గట్టిపోటీ ఇచ్చిందంటే విపక్షంలో వున్నా, పార్టీ క్షేత్రస్థాయిలో బలీయమైన ఓటుబ్యాంకును కలిగివున్నదనే అర్థం. అంతేకాదు మొత్తం 116 మున్సిపాలిటీల్లో 38 హంగ్ ఏర్పడ్డాయంటే కాంగ్రెస్ బలం అనేదానికంటే, బీఆర్ఎస్ సత్తా అని గుర్తించాలి. ఎందుకంటే ప్రధానంగా స్థానిక ఎన్నికల్లో అధికారపార్టీకే అత్యధిక సానుకూలత వుంటుంది. గత మున్సిపల్ ఎన్నికల్లో అధికారంలో వున్న బీఆర్ఎస్‌కు 90శాతం మున్సిపాలిటీలు స్వాధీనం కావడాన్ని పరిశీలిస్తే ఈసారి కాంగ్రెస్ పనితీరు "నెంబర్ గేమ్"లో బాగుందనిపించినా, ఓటింగ్ పరంగా పరిశీలిస్తే పనితీరు ఆశించినస్థాయిలో లేదని చెప్పక తప్పదు. చాలా వార్డుల్లో పదికంటే తక్కువ ఓట్లతో గెలుపు సాధించిన సందర్భాల్లో రీకౌంటింగ్‌కు డిమాండ్లు వెల్లువెత్తాయి. ముఖ్యంగా బీఆర్ఎస్, బీజేపీలు ఈవిధంగా స్వల్ప ఓట్ల మార్జిన్‌తో ఓటమి పాలైనప్పుడు రీకౌంటింగ్‌లు జరిగాయి. ఈ అంశాలను పరిశీలిస్తే రాష్ట్రంలో విపక్షాల బలహీనపడలేదన్న సత్యం కాంగ్రెస్ నేతలకు నిద్రలేని రాత్రులను మిగల్చవచ్చు. నెంబర్‌గేమ్ మాట అట్లా వుంచితే ఇంతటి బలమైన ఓటు బ్యాంకు చెక్కు చెదరలేదంటే 2028 అసెంబ్లీ ఎన్నికల వరకు రేవంత్ ప్రభుత్వం మరింత గట్టి పనితీరును ప్రదర్శించకపోతే పుట్టి మునగడం ఖాయమన్న సంకేతాలను ఈ ఎన్నికల ఫలితాలు ఇస్తున్నాయి. అంతేకాదు ఈ ఫలితాలు ప్రజల్లో ప్రభుత్వం పట్ల పెరుగుతున్న వ్యతిరేకతకు చిహ్నం కూడా! అందువల్ల ప్రభుత్వ పెద్దలు, ప్రతి దానికీ విపక్షాలను విమర్శించడం మాని తామేం చేస్తున్నదీ ప్రజలకు విడమరచి చెప్పి అభిమానాన్ని సంపాదించుకునే యత్నం చేయాలి. గత ప్రభుత్వంలో పనిచేసినవారిలో కొంతమంది రేవంత్ మంత్రివర్గంలో కూడా వుండటంతో, అదేపనిగా బీఆర్ఎస్‌పై చేస్తున్న విమర్శలు బూమరాంగ్ అయి, వీరే సమాధా నం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అంటే బీఆర్ఎస్‌ను విమర్శించడమంటే తమను తా ము వేలెత్తిచూపుకున్నట్టే! ప్రజలు అమాయకులు కారు. అధికారపక్షం చేసే ప్రతి పనిని వారుపరిశీలించి, ఓటింగ్ రూపంలో మార్కులు వేస్తారన్నది గుర్తించాలి.

విశ్లేషిస్తే 38 మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడిందంటే, విపక్షం చాలా బలంగా వున్నదనేగా అ ర్థం. కేసముద్రం మున్సిపాలిటీలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చెరి 8 స్థానాలను గెలుచుకున్నాయి. వికారాబాద్‌జిల్లా పరిగి మున్సిపాలిటీలో మొత్తం 18 స్థానాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చెరి 8 వార్డులను కైవసం చేసుకున్నాయి. జోగులాంబ గద్వాల్ జిల్లాలో మొత్తం 77 స్థానాల్లో బీఆర్ఎస్‌కు 30, కాంగ్రెస్‌కు 29 వచ్చాయి. అంటే అధికారపార్టీ కంటే బీఆర్ఎస్‌కు ఒక్కస్థా నం ఎక్కువ. జనగాం 30 వార్డుల్లో, తొర్రూరు 16 వార్డుల్లో వచ్చిన ఫలితాల పుణ్యమాని ఛైర్‌పర్సన్ ఎన్నికకు 'టై' పరిస్థితి ఏర్పడింది. విచిత్రమేమంటే కాంగ్రెస్‌కు చెందిన ఎక్స్‌–అఫిసియో సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నప్పటికీ చెరిసమానం కావడంతో తప్పనిసరిపరిస్థితుల్లో లాటరీ ద్వారా విజేతను ప్రకటించారు. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులునెలకొన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో చాలా స్థానాల్లో తక్కువ మార్జిన్లు వుండటంతో రీకౌం టింగ్ చేయాల్సి వచ్చింది. కరీంనగర్, సంగారెడ్డి, పరిగి ప్రాంతాల్లో కౌంటింగ్ జరుగుతున్నప్పుడు ప్రత్యర్థి పార్టీ కార్యకర్తల మధ్య ఘర్షణలు జరగడం గమనార్హం. అసీఫాబాద్, దేవర కొండ, ఆలంపూర్, కోహిర్, కేసముద్రం, అమరచింత, క్యాతనపల్లి వార్డుల్లో ఏ పార్టీ స్పష్టమైన మెజారిటీ సాధించలేకపోయింది. ఒక్కో వార్డు గెలుపు, ఛైర్‌పర్సన్ స్థానానికి కీలకంగా మారడంతో ఎంతో ఉత్కంఠ నెలకొంది. కేసముద్రంలో 8–8 స్థానాల్లో గెలుపుతో రెండు పార్టీలుఢీ అంటే ఢీ అనే స్థాయిలో పోటీపడ్డాయి. అయితే జగిత్యాల పరిస్థితి భిన్నం. ఇక్కడ కాంగ్రెస్‌కు 12, బీఆర్ఎస్‌కు 4 స్థానాలు రాగా 14 వార్డులను ఇండిపెండెంట్లు గెలుచుకోవడంతో ఛైర్‌పర్సన్ ఎన్నికకు చాలా విచిత్ర పరిస్థితి నెలకొంది.

మొత్తం ఎన్నికలు పూర్తయ్యాక తెలంగాణ ఎన్నికల సంఘం ఒక ప్రకటన జారీచేస్తూ మొత్తం93 మున్సిపాలిటీలను కాంగ్రెస్, 19 బీఆర్ఎస్ గెలుచుకున్నాయని వెల్లడించింది. కానీ మొ త్తం 116 మున్సిపాలిటీల్లో 38 అంటే 1/3శాతం హంగ్ ఫలితాలన్నివ్వడాన్ని గమనిస్తే, కాం గ్రెస్, బీఆర్ఎస్‌లు ఇక్కడ సమాన బలంతో వున్నాయన్నది అర్థమవుతుంది. దేవరకొండ మున్సిపాలిటీని కేవలం ఒక ఇండిపెండెంట్ అభ్యర్థి మద్దతుతో మాత్రమే కాంగ్రెస్ తన ఖాతాలోవేసుకోగలిగింది. అలంపూర్, కేసముద్రంలో కూడా ఇదే పరిస్థితి. ఇవన్నీ హంగ్ ఏర్పడిన 38 మున్సిపాలిటీల్లో కొన్ని. ఇంకా చాలా మున్సిపాలిటీను కాంగ్రెస్ చాలా తక్కువ మెజారిటీలేదా లాటరీల ద్వారా మాత్రమే స్వాధీనం చేసుకోగలగడాన్ని గమనిస్తే, బీఆర్ఎస్ ఎక్కడా బలహీన పడలేదన్న సంగతి స్పష్టమవుతోంది.

ఇక వార్డుల్లో కూడా కేవలం సింగిల్ ఓటు మెజారిటీలో కాంగ్రెస్ విజయం సాధించినవి కూడా చెప్పుకోదగ్గ స్థాయిలోనే వుండటం గమనార్హం. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో 13వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి కేవలం ఒకే ఒక్క ఓటుతో గెలిచాడు. జనగాం మున్సిపాలిటీలోని 7వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి, బీఆర్ఎస్‌పై కేవలం రెండు ఓట్ల తేడాతోనే గట్టెక్కడం గమనార్హం. తొర్రూరులోని 4వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థికి వచ్చిన మెజారిటీ ఓట్లు కేవలం 3. దేవరకొండ మున్సిపాలిటీలోని 9వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి 4ఓట్ల మార్జిన్‌తో గెలిచాడు. ఆలంపూర్, క్యాతనపల్లిల్లో కూడా 3–4 ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ గెలిచిన స్థానాలు బాగానే వున్నాయి. అభ్యర్థి గెలుపు పది ఓట్లకంటే తక్కువ వున్నప్పుడు రీకౌంటింగ్ కోరడం సహజం. ఈ ఎన్నికల్లో కూడా ఇదే జరిగింది.

బద్ధవైరంగా వున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య పరస్పర అవగాహన కూడా కొన్ని మున్సిపాలిటీల్లో కనిపించింది. ఇది స్థానిక నాయకత్వాల మధ్య వున్న అవగాహనే కారణమని చెప్పక తప్పదు. ఇక్కడ పార్టీల వైరుధ్యం కంటే, స్థానిక నాయకుల సమన్వయం ప్రాధాన్యత వహించా యని అర్థం చేసుకోవాలి. ఒక కోణంలో ఆలోచిస్తే దీన్నొక సానుకూల పరిణామంగా చెప్పవచ్చు. కామారెడ్డి మున్సిపాలిటీలో 11 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ ఛైర్‌పర్సన్ అభ్యర్థికి మద్దతివ్వగా, కాంగ్రెస్ కౌన్సిలర్లు వైస్‌ఛైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థికి సపోర్ట్ చేశారు. అమరచింత మున్సిపాలిటీలో మరో విచిత్రం జరిగింది. బీఆర్ఎస్ తరపున గెలిచిన కౌన్సిలర్ కాం గ్రెస్‌లో చేరడంతో, సీపీఎం మద్దతుతో పార్టీ మున్సిపాలిటీని కైవసం చేసుకుంది. ఇక ఆమనగల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కౌన్సిలర్, కాంగ్రెస్‌లోకి చేరగా, బీజేపీ మద్దతుతో మున్సిపా లిటీని గెలుచుకుంది. ఇక ఇస్నాపూర్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కౌన్సిలర్ మరో ముగ్గురు ఇండిపెండెంట్లతో కలిసి కాంగ్రెస్‌లో చేరగా, మరో కాంగ్రెస్ కౌన్సిలర్‌ను బీఆర్ఎస్ చేర్చుకోవడం 'తగ్గేదే లేదు' రాజకీయం నడిచింది. రాయ్‌కల్‌లో కాంగ్రెస్ మద్దతులో బీఆర్ఎస్ కౌన్సిలర్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఇక్కడ బీజేపీని దెబ్బకొట్టడానికి ఈ రెండు పార్టీలు ఏకమయ్యాయన్న సంగతి సుస్పష్టం. ఇక నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీజేపీని అధికా రంలోకి రాకుండా చేయడానికి ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఏకం కావడం మరో విచి త్రం. మొత్తంమీద పరిశీలిస్తే నాలుగు సందర్భాల్లో కాంగ్రెస్ మద్దతుతో బీఆర్ఎస్ కౌన్సిలర్లకు పోస్టులు (వైస్‌ఛైర్మన్) రావడం గమనార్హం.

మొత్తంమీద పరిశీలిస్తే కాంగ్రెస్ సొంతంగా గెలిచింది 66 మున్సిపాలిటీల్లో! మరో 25 ము న్సిపాలిటీలను అలయన్స్‌లు లేదా ప్రత్యర్థి పార్టీలనుంచి వలసనలను ప్రోత్సహించడం ద్వారా కైవసం చేసుకోగలిగింది. బీఆర్ఎస్ మొత్తం 18 ఛైర్‌పర్సన్ పోస్టులను సొంతంగా గెలుచు కుంది. ఇక వైస్‌ఛైర్‌పర్సన్ పోస్టులను కాంగ్రెస్ ఇతరపార్టీలతో జట్టు కట్టడం ద్వారా 84 వైస్‌ఛైర్‌పర్సన్/డిప్యూటీ మేయర్ పోస్టులను పొందగలిగాయి. వార్డుల విషయానికి వస్తే మొత్తం 2996 వార్డుల్లో, 1537 కాంగ్రెస్, బీఆర్ఎస్ 717, బీజేపీ 261 వార్డులను గెలుచుకున్నాయి. ఇక స్ట్రైక్‌రేట్ విషయానికి వస్తే కాంగ్రెస్ 51.3%, బీఆర్ఎస్‌కు 26.1%. మొత్తం 7 ము న్సిపల్ కార్పొరేషన్లలో ఐదింటిని కాంగ్రెస్ గెలుచుకున్నా, రామగుండం, మంచిర్యాల, నల్గొండ కార్పొరేషన్లను మాత్రం సొంతంగా గెలుచుకోగలిగింది. మిగతా రెండింటిలో ఇతరుల మద్దతు అవసరమైంది. నెంబర్ గేమ్‌లో 93-94 మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఆధీనంలోకి వెళ్లినా సొంతబలంలో గెలి చింది కేవలం 66 మున్సిపాలిటీల్లోనే అన్నది గమనార్హం. మిగిలిన స్థానాల్లో వలసలను ప్రో త్సహిచడం, మద్దతు కోసం రాజకీయాలు నడపడం, ఎక్స్‌ాఅఫిసియో మెంబర్ల ఓట్ల ద్వారా గెలవగలిగిందనేది సత్యం. మొత్తంమీద ఈ గణాంకాల ఆధారంగా విశ్లేషించినప్పుడు కాంగ్రె స్‌కు పూర్తిస్థాయి మద్దతు లేదన్న సంగతి స్పష్టమవుతోంది. ఇదే సమయంలో బీఆర్ఎస్ బలహీన పడిందన్న వాదనలూ సరికాదు. ఇక ముందు కాంగ్రెస్ పాలన టైట్ రోప్ వాక్ అనే చెప్పాలి. ఏమాత్రం తప్పు జరిగినా క్యాష్ చేసుకోవడానికి బీఆర్ఎస్ అనుక్షణం పొంచి వుంటుందనేది సత్యం!

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి,చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి








# నేటిధాత్రి
తెలుగు వార్తా పత్రిక

21st ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం





బుధవారం 25-02-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 21 సంచిక : 281 రూ॥ 6.00

## వైకాపా హయాంలో కల్తీ నెయ్యితో
# 20 కోట్ల లడ్డూల తయారీ

- 2019–24 మధ్య 59.71లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగం
- రూ.231.51 కోట్ల అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ
- ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగానే కల్తీ జరిగిందని చెప్పా
- అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారు
- కల్తీపై దేవుడే తనతో విషయాలు వెల్లడించేలా చేశారు
- మహాపాపం' పేరిట లడ్డూ కల్తీ పై అసెంబ్లీలో బాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

అమరావతి,నేటిధాత్రి:
వైకాపా హయాంలో 20 కోట్ల లడ్డూలను కల్తీ నెయ్యితో తయారు చేశారని ఏపీ సీఎం చంద్రబాబు

04 లో

## కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులకు
# శిక్షపడాల్సిందే



- ఆనాటి బోర్డును జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారు
- రసాయనాలతో కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని రుజువయ్యింది
- అసెంబ్లీలో డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్

అమరావతి, నేటిధాత్రి:
కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులు ఎవరైనా

04 లో

## నెయ్యి సేకరణలో 2020లో
# నిబంధనలు మార్పు

- కల్తీ వ్యవహారంపై తొలుత తిరుపతి ఈస్ట్ పిఎస్‌లో కేసు
- అసెంబ్లీలో కల్తీ లడ్డూ కేసు వివరాలు వెల్లడించిన ఆనం

అమరావతి, నేటిధాత్రి:
తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై తొలుత తిరుపతి

04 లో

## గుంటూరు ఛానల్ ఆధునీకరణకు
# 369 కోట్లు

- ప్రభుత్వ పరిశీలనలో అంచనాలు
- మండలిలో ప్రశ్నలకు మంత్రి నిమ్మల సమాధానం

అమరావతి, నేటిధాత్రి:
గుంటూరు ఛానల్ ఆధునీకరణకు 369 కోట్ల రూపాయలతో అంచనాలు రూపొందించారని నీటిపారుదల శృాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

05 లో

## కొండ ప్రాంతాల్లో రహదారుకలు
# అడవితల్లి బాట

- రూ.1,077 కోట్లతో ఈ కార్యక్రమం అమలు
- అసెంబ్లీలో ప్రశ్నకు మంత్రి నాదెండ్ల సమాధానం

అమరావతి, నేటిధాత్రి:
గిరిజన గ్రామాలు, కొండ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాల కోసం 'అడవితల్లి బాట' కార్యక్రమం

05 లో

## పర్యాటకంగా విశాఖలో
# పలు అభివృద్ధి పనులు

- రూ.8,650 కోట్ల పెట్టుబడులతో 50 ఒప్పందాలు
- అసెంబ్లీలో మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడి

అమరావతి,నేటిధాత్రి:
ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో విశాఖ నగరం కీర్తి కిరీటంగా నిలుస్తుందని మంత్రి కందుల దుర్గేశ్

05 లో





## వరంగల్ గడ్డపైనే
# నిరాహారదీక్షకు దిగుతాం

### రేవంత్ రెడ్డికి ఫ్యూచర్ సిటీ పై ఉన్న ధ్యాస.. పేదలకు ప్రాణం పోసే హెల్త్ సిటీ పై లేదు : మాజీ మంత్రి హరీష్ రావు

వరంగల్, నేటిధాత్రి:
వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డికి రియల్ ఎస్టేట్ ఫ్యూచర్ సిటీపై ఉన్న శ్రద్ధ పేదలకు ప్రాణాధారమైన హెల్త్ సిటీపై లేదని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో పూర్తి కావాల్సిన వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కాంగ్రెస్ పాలనలో నత్తనడకన సాగుతోందని అన్నారు. వెంటనే పనులు పూర్తి చేసి ప్రారంభించకపోతే బీఆర్ఎస్ తరపున వరంగల్ గడ్డపైనే నిరాహారదీక్షకు దిగుతామని హెచ్చరించారు. దేవాదుల ప్రాజెక్టుపై కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సమ్మక్క బ్యారేజీలో 10 మోటార్లలో కేవలం 6 మాత్రమే నడుస్తున్నాయని, అవసరమైన నీటి ఎత్తిపోతల జరగడం లేదని తెలిపారు. బీఆర్ఎస్ ప్రశ్నించిన తరువాతే సీఎం రివ్యూ నిర్వహించారని పేర్కొన్నారు. డెడ్ లైన్లు మారుతున్నాయి తప్ప పనులు ముందుకు సాగడం లేదని విమర్శించారు.కేసీఆర్ హయాంలో వేల కోట్లతో లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని, ప్రస్తుతం రైతులకు కనీసం నీళ్లు అందడం లేదని అన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై అసెంబ్లీలో మైక్ కట్ చేయకుండా చర్చకు రావాలని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి పరిస్థితి దయనీయంగా మారిందని, పరికరాలు పనిచేయడం లేదని, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. గతంలో ఉచిత గుండె ఆపరేషన్లు జరిగాయని, ఇప్పుడు రోగులను హైదరాబాద్‌కు పంపిస్తున్నారని విమర్శించారు. 2000 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభానికి అవసరమైన డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది నియామకంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం ఓపీ సేవలు ప్రారంభించడం సరిపోదని, పూర్తిస్థాయిలో ఆసుపత్రి ప్రారంభించాలన్నారు. ఉద్యోగులు, జర్నలిస్టుల ఆరోగ్య పథకాలు అమలు చేయాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ అరెస్టులు మానుకుని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

- నాడు కేసీఆర్ హయాంలో ఉచితంగా గుండె ఆపరేషన్లు చేసిన ఎంజీఎం ఆసుపత్రి.. నేడు కాంగ్రెస్ పాలనలో ఎలుకలు, పందికొక్కులకు అడ్డాగా మారింది.
- బీఆర్ఎస్ నాయకులపై కక్ష సాధింపులు, అక్రమ అరెస్టులు మానుకొని ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయడం మీద ముఖ్యమంత్రి దృష్టి పెట్టాలి.

ఈ పర్యటనలో ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, దేశపతి శ్రీనివాస్, రవీందర్ రావు, కవిత, తాటికొండ రాజయ్య, వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- దేవాదుల పనులు చేయడం చేతగాక మంత్రులకో డెడ్ లైన్, ముఖ్యమంత్రికో డెడ్ లైన్ పెడుతూ దేవాదుల ప్రాజెక్టును కాంగ్రెస్ సర్కార్ ఆగమాగం చేస్తోంది.
- కేసీఆర్ కి మంచి పేరు వస్తుందనే అక్కసు తోనే.. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను కావాలనే నత్తనడకన సాగిస్తున్నారు.
- రేవంత్ రెడ్డికి కమీషన్లు తెచ్చే రియల్ ఎస్టేట్ ఫ్యూచర్ సిటీ మీద ఉన్న ధ్యాస.. పేదలకు ప్రాణం పోసే వరంగల్ 'హెల్త్ సిటీ' మీద లేదు.
- వెంటనే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు పూర్తి చేసి ప్రారంభించకపోతే.. బీఆర్ఎస్ పక్షాన వరంగల్ గడ్డపైనే నిరాహారదీక్షకు దిగుతాం.

## మావోయిస్ట్ పార్టీకి భారీ దెబ్బ



- డిజిపి ఎదుట లొంగిన ప్రధాన నేతలు
- లొంగిన వారిలో దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, జగన్, గంగన్న
- 40 ఏళ్ల అజ్ఞాతానికి వీడ్కోలు పలికిన మావోలు
- వారిపై ఉన్న రివార్డును అందిస్తామన్న డిజిపి
- కేవలం ఇక 11 మంది మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని వెల్లడి

హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణలో నలుగురు మావోయిస్టు అగ్రనేతలు మంగళవారం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో అధికారికంగా లొంగిపోయారు. వీరిలో పొలిట్ బ్యూరో

04 లో

## ప్రజాజీవితంలోకి రావాలనే అజ్ఞాతం వీడాం

- ప్రజల సమస్యల కోసం ఇకముందూ పోరాడుతాం
- లొంగిన మావోయిస్ట్‌లు దేవీజీ, రాజిరెడ్డి వెల్లడి

హైదరాబాద్, నేటిధాత్రి:
మావోయిస్ట్ పార్టీకి చెందిన అగ్రనేతలు డిజిపి ఎదుట లొంగిపోయారు. అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలోకి

05 లో

# రేవంత్ రెడ్డీ గుర్తుపెట్టుకో..

### నువ్వు చిప్పకూడు తినే సమయం కచ్చితంగా వస్తది : కేటీఆర్



ఆదిలాబాద్, నేటిధాత్రి:
ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ బాల్క సుమన్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. జైలులో పెడితే మా నాయకులు భయపడుతారని కాంగ్రెస్ నేతలు అనుకుంటున్నారని, ఇలాంటి ఉడుత ఊపులకు తాము భయపడబోమని కేటీఆర్ చెప్పారు. బాల్క సుమన్ ఇవాళ కొత్తగా జైలుకుపోలేదని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఆరు నెలలు జైల్లో ఉన్నాడని తెలిపారు.
రేవంత్ రెడ్డి ప్రభుత్వం మున్సిపాలిటీల్లో అక్రమంగా అధికారాన్ని హస్తగతం చేసుకుందని కేటీఆర్ ఆరోపించారు. ఆదేమని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించిందని విమర్శించారు. క్యాతన్‌పల్లిలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలో జరిగిన అక్రమాన్ని ప్రశ్నించినందుకు బాల్క సుమన్‌ను జైల్లో పెట్టారని మండిపడ్డారు. 'రేవంత్ రెడ్డీ గుర్తుపెట్టుకో.. నువ్వు మళ్లీ చిప్పకూడు తినే సమయం కచ్చితంగా వస్తుంది' అని ముఖ్యమంత్రిని హెచ్చరించారు.
కేటీఆర్ ఇంకా మాట్లాడుతూ.. 'కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాయి, బీఆర్ఎస్ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేశారు. కొన్ని మున్సిపాలిటీల్లో ప్రజాతీర్పును

05 లో



## నేటినుంచి ఇంటర్ పరీక్షలు

- భారీగా ఏర్పాట్లు చేసిన బోర్డు
- పరీక్షా కేంద్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, నేటిధాత్రి:
ఇంటర్ వార్షిక పరీక్షలు ఈ నెల 25, బుధవారం

05 లో

## 5 నిముషాల ఆలస్యాన్ని
# పరిగణిస్తాం

- అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి
- పకడ్బందీగా పరీక్షల నిర్వహణ
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్

హైదరాబాద్, నేటిధాత్రి:
రాష్ట్రంలో జరుగనున్న ఇంటర్ మీడియట్,

05 లో





## ప్రజల పాలిట
# పాలకూట విషం

### కల్తీపాలు ఉంభకోణం బహిర్గతం..
### ఐదుగురు మృతి పలువురు ఆస్పత్రిలో

- డెయిరీ నిర్వాహకుడు అదుపులోకి
- రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రభుత్వం
- కఠిన చర్యలు కోరుతున్న ప్రజలు

పాలు తాగితే పోషణ... ఇప్పుడు ప్రమాదం
ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం

12 లో

- పాలలో విషం... రాజమహేంద్రవరంలో ఐదుగురు మృతి
- కాలకూటంగా మారిన పాలు – ప్రజల్లో భయం
- యూరియా కల్తీ పాల కుంభకోణం బహిర్గతం
- కల్తీ డెయిరీ దందా బట్టబయలు –ప్రాణాలు బలిగొన్న నిర్లక్ష్యం
- పాలు కాదు... విషం తాగుతున్న ప్రజలు
- కృత్రిమ పాల మాఫియా పంజా – చిన్నారులు, వృద్ధులు బలి
- ఫుడ్ సేఫ్టీ వైఫల్యం –పాల కల్తీతో విషాదం
- రాజమహేంద్రవరాన్ని కుదిపేసిన కల్తీ పాల ఘటన
- లాభాల కోసం ప్రాణాలతో ఆట – పాలలో రసాయనాలు
- డెయిరీ మోసం... కిడ్నీ ఫెయిల్యూర్ వరకు ప్రమాదం

# గణపతి ఆచూకీ కనుగొన్న పోలీసులు

## నేపాల్‌లో ప్రవాసంలో ఉన్నట్లుగా గుర్తింపు

హైదరాబాద్, నేటిధాత్రి:

కొన్ని దశాబ్దాల పాటు మావోయిస్టు పార్టీని నడిపించిన అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ రావు ఆచూకీ లభ్యమైంది. గత కొన్నేళ్లుగా భారత్ పొరుగునున్న నేపాల్‌లో ఆయన మకాం వేశారు. తీవ్ర అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన నడవలేని పరిస్థితిలో ఉన్నారు. అయితే గణపతిని భారత్‌కు రప్పించేందుకు తెలంగాణ పోలీసులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. వృద్ధాప్యం కారణంగా మావోయిస్టు పార్టీ కార్యదర్శి పదవిని గణపతి వదిలిపెట్టిన సంగతి తెలిసిందే. మరో వైపు హైదరాబాద్‌లో పోలీస్ ఉన్నతాధికారుల ఎదుట నలుగురు కీలక మావోయిస్టులు లొంగిపోనున్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సెక్రటరీ దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు, కేంద్ర కమిటీ సభ్యులు మల్లా రాజిరెడ్డితోపాటు నున్నె నరసింహారెడ్డిలు లొంగిపోనున్నారు. ఇటీవల ఆసీఫాబాద్ అడవుల్లో ఎస్ఐబీ ఎదుట దేవ్ జీతోపాటు మల్లా రాజిరెడ్డి లొంగిపోయిన సంగతి తెలిసిందే. అదీకాక దేవ్ జీతోపాటు పలువురు అగ్రనేతలు మధ్యప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గఢ్ తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టలకు చేరుకున్నారంటూ నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. ఈ నేపథ్యంలో కర్రెగుట్టల ప్రాంతంలో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టులు



మరణించిన విషయం విదితమే. 2026, మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకొంది. ఆ దిశగా వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. దీంతో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో భద్రతా బలగాలు నిరంతరం కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో వందలాది మంది మావోయిస్టులు మరణించారు. వేలాది మంది ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. పలువురు అరెస్టయ్యారు. భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లలో పలువురు అగ్రనేతలు సైతం మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే మావోయిస్టు అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణరావు పోలీసులకు చిక్కితే.. మావోయిస్టు పార్టీ చరిత్రగా మిగిలిపోయే అవకాశం ఉందనే ఒక చర్చ సాగుతోంది.

# ఎంతకాలం ఉంటానో తెలియదు..




- అయినా వెనకడుగు వేసే ప్రసక్తి లేదు
- నన్ను చంపడానికి అందరూ కాచుక్కూచున్నారు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య

వాషింగ్టన్, నేటిధాత్రి:

'నేను ఎంతకాలం ఉంటానో తెలియట్లేదు' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇటీవల ఫ్లోరిడాలోని తన నివాసంలోకి ఓ సాయుధ దుండగుడు చొరబడిన ఘటనపై స్పందిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మార్-ఎ-లాగో రిసార్ట్ లోకి తుపాకీతో చొరబడేందుకు ప్రయత్నించిన ఆగంతుకుడిని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్చి చంపిన ఘటనపై డొనాల్డ్ ట్రంప్ తొలిసారి స్పందించారు. ఈ భద్రతా లోపంపై ఆయన కాస్త ఆందోళన, మరికాస్త వ్యంగ్యంగా మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. వైట్ హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్.. నేను ఇంకా ఎంతకాలం ఇక్కడ ఉంటానో నాకు తెలియదు. నా కోసం తుపాకులు పట్టుకుని ఎంతమంది వేచి చూస్తున్నారో చూశారుగా ?' అని వ్యాఖ్యానించారు. గొప్ప నాయకులకే ఇలాంటి ముప్పు ఉంటుందని, అబ్రహం లింకన్, కెన్నడీ వంటి 'ప్రభావశీల' అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని చెప్పారు. బహుశా నేను కొంచెం తక్కువ ప్రభావశీల నాయకుడిగా ఉంటే బాగుండేదేమో.. కాసేపు సాధారణ అధ్యక్షుడిలా ఉందాం అని చమత్కరించారు. ఫిబ్రవరి 22 తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో ఆస్టిన్ టక్కర్ మార్టిన్ (21) అనే యువకుడు షాట్ గన్, ఇంధనం క్యాన్‌తో మార్-ఎ-లాగో ప్రహరీని దాటేందుకు ప్రయత్నించాడు. భద్రతా దళాలు హెచ్చరించినప్పటికీ, అతడు లొంగకుండా తుపాకీని ఎక్కుపెట్టడంతో సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మార్టిన్ అక్కడికక్కడే మరణించాడు. ఆ సమయంలో ట్రంప్ దంపతులు వైట్ హౌస్‌లో ఉన్నారు. గతంలో కూడా ట్రంప్‌పై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగిన విషయం తెలిసిందే. తాజా ఘటనలో చనిపోయిన యువకుడు ఎప్ స్టీన్ ఫైల్స్ విడుదలకు సంబంధించి ప్రభుత్వంపై అసహనంతో ఉన్నట్లు కొన్ని టెక్ట్స్ మెసేజ్‌ల ద్వారా వెల్లడయ్యింది. తనపై జరుగుతోన్న వరుస హత్యాయత్నాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. తనను హత్య చేయడానికి చాలా మంది ప్రయత్నాలు చేస్తున్నారని.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే తాను ఎంత కాలం ఉంటానో కూడా తెలియట్లేదన్నారు. ఇటువంటి షూటర్లు సాధారణ అధ్యక్షుల జోలికి వెళ్లరని.. కేవలం అసాధారణ విజయాలు సాధించే అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని అన్నారు. ఇలాంటి ఎన్ని బెదిరింపులకు పాల్పడినా.. తాను తీసుకునే నిర్ణయాలపై ఏ మాత్రం వెనక్కి తగ్గబోనన్నారు. 2024 జులైలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయనపై ఓ వ్యక్తి కాల్పులు జరిపాడు. ఆ ఘటనలో ట్రంప్ చెవి భాగం నుంచి తూటా దూసుకెళ్లింది. ఆ తర్వాత ఓసారి ట్రంప్ పామ్ బీచ్ గోల్ఫ్ కోర్స్‌లో రైఫిల్‌తో అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తినీ పోలీసులు అరెస్టు చేశారు.

# ఎఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ నిరసనలు



- యూత్ కాంగ్రెస్ చిల్లర చేష్టలపై విమర్శలు
- యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు చిబ్ అరెస్ట్

న్యూఢిల్లీ, నేటిధాత్రి:

ఢిల్లీలోని భారత్ మండపంలో ఇటీవల జరిగిన ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన 'షర్ట్‌లెస్' నిరసనకు సంబంధించి.. యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నిరసన గురువారం సమ్మిట్ ఎగ్జిబిషన్ హాల్‌లో జరిగిన సంగతి తెలిసిందే. ఐదుగురు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు షర్టులు విప్పేసి, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పం దానికి వ్యతిరేకంగా సందేశాలు రాసిన టీ-షర్టులు పట్టుకొని నిరసన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీపై ఆరోపణలు గుప్పించారు. సెక్యూరిటీ సిబ్బంది.. వారిని వెంటనే బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటన తర్వాత ఏడుగురు కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఢిల్లీ పోలీసులు ఉదయ్ భానును అరెస్టు చేశారు. ఆయన్ను తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో 15 గంటలకు పైగా విచారించిన తర్వాత అరెస్ట్ చేశారని సమాచారం. దీంతో ఈ కేసులో మొత్తం అరెస్ట్‌ల సంఖ్య ఎనిమిదికి చేరింది. పోలీసులు ఆయనపై.. కుట్రలో పాత్ర ఉందని, విచారణకు సహకరించలేదని, తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. త్వరలోనే కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. భూపేశ్ బాఘేల్ వంటి సీనియర్ నేతలు ఈ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. 'ప్రజాస్వామ్యంలో యువత ప్రశ్నలు వేయడం, నిరసన తెలపడం నేరం కాదు,అది ప్రజాస్వామ్య ఆయుధం' అని బాఘేల్ అన్నారు. ఈ అరెస్ట్‌లను అరాచక, అన్యాయ చర్యలుగా పేర్కొన్నారు. నిరసన శాంతియుతం గా జరిగిందని, యువత బాధలను బయటపెట్టడమే ఉద్దేశ్యమని కాంగ్రెస్ వర్గాలు వాదిస్తున్నాయి. బీజేపీ నేత ప్రదీప్ భండారి ఈ నిరసనను 'నేక్డ్ యాంటీ-ఇండియా ప్రొటెస్ట్' అని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను యాంటీ-ఇండియా, యాంటీ-గ్రోత్ పార్టీగా విమర్శించారు. 'యువతకు కాంగ్రెస్ 'నంగి' పార్టీగా కనిపిస్తోంది' అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో జరుగుతున్న చర్చలు, ప్రదర్శనలకు సంబంధించింది. దీనిని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈవెంట్‌గా చూస్తున్నారు. అయితే.. ఈ నిరసన వెనుక రాజకీయ కుట్ర కోణం ఉందని, దేశం పరువు మంటగలపాలన్నది వీరి పన్నాగమని బీజేపీ వర్గాలు మండిపడుతున్నాయి.

# అధికారం అడ్డంపెట్టుకుని దోపిడీ

- నెయ్యి నిబంధనలు మార్చిందెవరు
- అసెంబ్లీలో టిడిపి ఎమ్మెల్యే ధూళిపాళ్ల

అమరావతి, నేటిధాత్రి:

వైకాపా హయాంలో ఆ పార్టీ నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని సొంత కంపెనీలకు దోచిపెట్టారని తెదేపా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర విమర్శించారు. తిరుమల నెయ్యి సేకరణకు సంబంధించిన కఠిన నిబంధనలను మార్చిందెవరని ఆయన ప్రశ్నించారు. రోజుకు 4లక్షల లీటర్ల సామర్థ్యం నిబంధనను తీసేశారని.. రూ.250 కోట్ల టర్నోవర్‌ను రూ.150 కోట్లకు తీసుకొచ్చారని చెప్పారు. డెయిరీ అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి తీసుకొచ్చారన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో ధూళిపాళ్ల మాట్లాడా



రు. నిబంధనలు సడలింపు చేయడంతో తమకు కావాల్సిన ప్రైవేటు వ్యాపారులకు టెండర్లు ఇచ్చేందుకు పునాది పడింది. ఒక మహాపాపం, దోపిడీకి ఆనాడే తెరలేపారు. కల్తీ నెయ్యిని ఏటా సరఫరా చేశారు. నాటి ప్రభుత్వ పెద్దల భాగస్వామ్యం లేకపోతే తిరుమలలో ఐదేళ్లపాటు కల్తీ నెయ్యి సరఫరా సాగుతుందా? వైవీ సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా ఉన్నా ఎందుకు చర్యలు తీసుకోలేదు?' అని ఆయన ప్రశ్నించారు.

# వైకాపా హయాంలో కల్తీ నెయ్యితో 20 కోట్ల లడ్డూల తయారీ

- 2019-24 మధ్య 59.71లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగం
- రూ.231.51 కోట్ల అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ
- ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగానే కల్తీ జరిగిందని చెప్పా
- అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారు
- కల్తీపై దేవుడే తనతో విషయాలు వెల్లడించేలా చేశారు
- మహాపాపం' పేరిట లడ్డూ కల్తీ పై అసెంబ్లీలో బాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

అమరావతి,నేటిధాత్రి:

వైకాపా హయాంలో 20 కోట్ల లడ్డూలను కల్తీ నెయ్యితో తయారు చేశారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని ఆక్షేపించారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 'మహాపాపం' పేరిట వైకాపా హయాంలో లడ్డూ కల్తీ జరిగిన తీరును పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆయన వివరించారు. రాజకీయ వివాదం ఉండకూడదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సిట్ ఏర్పాటు చేశారు. సీబీఐ ఆధ్వర్యంలో విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపించింది. అందుకే ఏకసభ్య కమిటీ వేయాలని నిర్ణయించాం. లడ్డూ వ్యవహారంలో కాకుండా అనేక విషయాల్లో తప్పులు చేశారు. 2019-24 మధ్య 59.71లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగించారు. రూ.231.51 కోట్ల అక్రమాలు జరిగాయి. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను నీరుగార్చారు. ఒక పద్ధతి ప్రకారం లాలూచీ పడిన లూటీ అని స్పష్టంగా తేలింది. కల్తీ నెయ్యి అని నిర్ధారణ అయినా రిపోర్టును తొక్కిపెట్టారు. లడ్డూలో జంతుకొవ్వు కలిసిందని నేను సొంతంగా ఏమీ చెప్పలేదు. ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టునే చెప్పా. ఆ భగవంతుడే నాతో చెప్పించాడని చంద్రబాబు అన్నారు. గత వైసీపీ పాలనలో ఎన్నో విధ్వంసాలు చూశామని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దేవాలయాలపై దాడులు జరిగాయని ప్రశ్నిస్తే కేసులు పెట్టారన్నారు. రాముడి విగ్రహం ధ్వంసం చేశారని ప్రశ్నిస్తే తనపైనే దాడికి దిగారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రక్షాళన కోసం ఈవోను నియమించామని చెప్పారు. తన దృష్టికి వచ్చిన నేషనల్ డైయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ రిపోర్ట్ వివరాలు వెల్లడించానని తెలిపారు. శ్రీవారి లడ్డూ విషయంలోనే కాదు.. అనేక విషయాల్లో తప్పు చేశారంటూ వైసీపీ నేతలపై ఆయన మండిపడ్డారు. కుట్ర కోణాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. 59.71లక్షల కేజీల రసాయనాలతో కూడిన నెయ్యిని లడ్డూ తయారీలో వినియోగించారని వివరించారు. తద్వారా రూ. 234.51 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారంటూ వైసీపీ అగ్రనేతలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాబ్‌ల కళ్లుగప్పి



నెయ్యి టెండర్లు దక్కించుకున్నారని విమర్శించారు. 2019 - 24 మధ్య రసాయనాలతో తయారు చేసిన నెయ్యితో 20 కోట్ల లడ్డూలు తయారు చేశారని పేర్కొన్నారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని సీఎం చంద్రబాబు గణాంకాలతో సహా వివరించారు. 2026 జనవరి 23న ఈ కల్తీ లడ్డూ వ్యవహారంలో సీబీఐ చార్జ్‌షీట్ వేసిందని గుర్తు చేశారు. అలిపిరి ఘటనలో శ్రీవేంకటేశ్వర స్వామి వారే తన ప్రాణాలను కాపాడారని సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. కల్తీ నెయ్యి వినియోగం లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సిట్ వేయాలని ఆలోచించినట్లు ఏపీ సీఎం తెలిపారు. సిట్ ఏర్పాటును వైసీపీ నేతలు సుప్రీంకోర్టులో సవాల్ చేశారని గుర్తు చేశారు. రాజకీయ వివాదం ఉండొద్దనే కేంద్ర, రాష్ట్ర అధికారులతో సిట్ ఏర్పాటు చేశామని వివరించారు. సీబీఐ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీం సూచించిందన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపిందని పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు రద్దు చేసిందని గుర్తు చేశారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని చెప్పినందుకే ఏకసభ్య కమిటీ అని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సీబీఐ రిపోర్టుతోపాటు ఫోరెన్సిక్ ఆధారాలను ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు. 2020 జనవరి, ఫిబ్రవరిలో టెండర్ల నిబంధనలు మార్చారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. నాణ్యతా ప్రమాణాలకు సైతం వారు తిలోదకాలిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022 మేలో భోలేబాబా సంస్థపై ఫిర్యాదు, విచారణకు ఆదేశించారన్నారు. 2022 ఆగస్టులో బీటా సిటోస్టిరాల్‌తో రసాయనాలు కలిశాయని నివేదిక వచ్చిందని చెప్పారు. అఈ÷ఖీఎ ల్యాబ్ రిపోర్ట్ వస్తే.. దానిని సైతం తొక్కిపెట్టారన్నారు. 2024 జులై 23న రిపోర్ట్ వచ్చిందని.. అందులోని అంశాలనే భగవంతుడు తనతో చెప్పించాడని సీఎం చంద్రబాబు తెలిపారు. జంతు కొవ్వు కలిసిందని తాను సొంతంగా చెప్పలేదని స్పష్టం చేశారు. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేయాలన్న నిబంధనను సైతం తొలగించారన్నారు. 2019 ఆగస్టులో టెండర్ నిబంధనల్లో సడలింపు చేశారని చెప్పారు. టర్నోవర్, పాల సేకరణ సామర్థ్యాన్ని కూడా తగ్గించారని పేర్కొన్నారు.

2020 జనవరిలో శ్రీ వైష్ణవి ప్లాంట్‌ను తనిఖీ చేసి.. ఉత్పత్తి సామర్థ్యం లేకపోయినా నెయ్యి సరఫరాకు అనుమతి ఇచ్చారన్నారు. కేజీకి రూ.329 చొప్పున భోలేబాబాకు నెయ్యి సరఫరా ఆర్డర్ ఇచ్చారని పేర్కొన్నారు. 2022 జూన్‌లో ఫతేపూర్‌లోని భోలేబాబా ఎ÷-లాంట్ తనిఖీ చేసి.. డబ్బులు ఇవ్వలేదని ఆ సంస్థపై అనర్హత వేటు వేశారని సీఎం చంద్రబాబు చెప్పారు. ఒక పథకం ప్రకారం తిరుమల పవిత్రతను దెబ్బ తీసేందుకు కుట్ర చేశారంటూ వైసీపీ నేతలపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. తిరుమలకు ఏ మతస్థులైనా రావొచ్చునని.. అన్యమతస్థులు శ్రీవారి దర్శనానికి వస్తే డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉందన్నారు. అధికారంలో ఉన్నామని నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించారని చెప్పారు. టెండర్ నిబంధనలను పూర్తిగా గాలికొదిలేశారన్నారు. నాటి టీటీడీ బోర్డు చైర్మన్ పీఏ చిన్నఅప్పన్న లంచం తీసుకుని దొరికిపోయారని చెప్పారు. ఇవన్నీ నాటి టీటీడీ చైర్మన్, బోర్డుకు తెలిసే జరిగాయని తెలిపారు. నాడు లడ్డూలో నాణ్యత తగ్గిపోయిందని చాలా ఆరోపణలు వచ్చాయని గుర్తు చేశారు. కల్తీ నెయ్యి తయారీకి ముఠాగా ఏర్పడ్డారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. నాటి టీటీడీ చైర్మన్ పీఏ చిన్నప్పన్న రూ.4.5 కోట్ల లంచం తీసుకున్నారన్నారు. నకిలీ సర్టిఫికెట్లతో టెండర్లు దక్కించుకుని రసాయనాల నెయ్యి సరఫరా చేశారని తెలిపారు. కల్తీ నెయ్యి తయారీకి వివిధ రకాల రసాయనాలు వినియోగించినట్లు దర్యాప్తులో తేలిందని సీఎం చంద్రబాబు వివరించారు.



# నెయ్యి సేకరణలో 2020లో నిబంధనలు మార్పు

- కల్తీ వ్యవహారంపై తొలుత తిరుపతి ఈస్ట్ పిఎస్‌లో కేసు
- అసెంబ్లీలో కల్తీ లడ్డూ కేసు వివరాలు వెల్లడించిన ఆనం

అమరావతి, నేటిధాత్రి:

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై తొలుత తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. అనంతరం సీనియర్ అధికారులతో ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటైందని చెప్పారు. ఆ తర్వాత సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సిట్‌ను పునర్ వ్యవస్థీకరించినట్లు వివరించారు. తిరుమల లడ్డూ కల్తీ అంశంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో మంత్రి మాట్లాడారు. 2014నుంచి ఈ-టెండర్ల ద్వారా అగ్‌మార్క్ స్పెషల్ ఆవు నెయ్యిని తితిదే సేకరిస్తోంది. కమిటీ సిఫార్సుల ఆధారంగా 2019లో టెండర్ నిబంధనలను బలోపేతం చేశారు. ఆ తర్వాత 2020లో సేకరణ నిబంధనలను మార్చారు. 5 నెలల వ్యవధిలోనే వాటిని సవరించినట్లు తేలింది. నిర్వహణ అనుభవాన్ని 3 ఏళ్ల నుంచి ఏడాదికి.. వార్షిక టర్నోవర్ అవసరాన్ని తగ్గించారు. ఆవు పాల కొవ్వు ఉత్పత్తి ప్రమాణాలను తగ్గించారు. తప్పనిసరి పాల సేకరణ నిబంధనను తొలగించారు. సమగ్ర అధ్యయనం, క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా సడలింపు చేశారు. అనుభవం లేని డెయిరీల ప్రవేశానికి ఇది దోహదపడినట్లు సిట్ గమనించింది. భోలేబాబా, వైష్ణవి సంస్థలతో పాటు ఇతర నిందితుల డెయిరీలు తక్కువ ధరను కోట్ చేయడం ప్రారంభించాయి. భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా పేర్కొన్నప్పటికీ బిడ్డర్ల సంఖ్య గణనీయంగా పెరగలేదు. కొన్ని నిర్దిష్ట సరఫరా దారులకు మాత్రమే అసమానంగా ప్రయోజనం చేకూర్చినట్లు ఈ సడలింపు ద్వారా తెలుస్తోంది'అని ఆనం రామనారాయణరెడ్డి వివరించారు.

# కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులకు శిక్షపడాల్సిందే



- ఆనాటి బోర్డును జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారు
- రసాయనాలతో కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని రుజువయ్యింది
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

అమరావతి, నేటిధాత్రి:

కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులు ఎవరైనా సరే శిక్ష పడాల్సిందేనని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై శాసనసభలో జరిగిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. కల్తీనెయ్యిలో ఏ రసాయనాలు వాడారో ఆ పెరుమాళ్లకే తెలియాలి. జంతు సంబంధ రసాయనాలు ఉన్నాయని ఎన్‌డీడీబీ రిపోర్టు చెప్పింది. అది నెయ్యే కాదని సీబీఐ రిపోర్టు ఇచ్చింది. ఇది ధర్మానికి సంబంధించిన విషయం. సకల మతాలను గౌరవించడం ఈ దేశ సంస్కృతి. తితిదే పాత బోర్డును జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారు? అంటే ఆయనకూ భాగం ఉన్నట్టే కదా?' అని పవన్ అన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యి ఉపయోగించలేదని ఇప్పటికే తేలిపోయిందన్నారు. నెయ్యిలో రసాయనాలు కలవలేదని వైసీపీ అబద్ధాలు చెబుతోందని.. అందుకే తాము వివరణ ఇవ్వాల్సి వచ్చిందని పవన్ తెలిపారు. కల్తీ నెయ్యి తయారీలోనూ సృజనాత్మకత చూపించారని.. నెయ్యి కావాలంటే పాల నుంచే కాదు రసాయనాల నుంచీ తయారు చేయొచ్చని నిరూపించారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వాధినేత తప్పుచేశారని తానెక్కడా చెప్పలేదని.. అప్పటి టీటీడీ పాలకమండలి తన బాధ్యత నిర్వహణలో విఫలమైందని విమర్శించారు. తాము ఏ ఒక్కరిపైనా ఆరోపణలు చేయడం లేదని.. జగన్ నియమించిన బోర్డు హయాంలోనే తప్పు జరిగిందని డిప్యూటీ సీఎం అన్నారు. నాటి టీటీడీ బోర్డు సభ్యులను మాజీ సీఎం జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారని ప్రశ్నించారు. 'దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవచ్చని జగన్ చెబితే సరిపోయేది.. వెనకేసుకొస్తున్నారంటే మీకూ భాగస్వామ్యం ఉన్నట్టే కదా?' అని అనుమానం వ్యక్తం చేశారు పవన్. అసలు నెయ్యిలో రసాయనాలు కలవలేదని వైసీపీ నేతలు చెప్పడమేంటని నిలదీశారు. ప్రసాదాన్ని అపవిత్రం చేసేందుకు కుట్ర జరిగిందని సిట్ తేల్చిందని చెప్పారు. నచ్చినవారికి కాంట్రాక్టులు ఇచ్చుకునేందుకు నిబంధనలు సడలించారని పవన్ ఆరోపించారు.

రూ.20 కోట్ల లడ్డూలు రసాయనాల నెయ్యితో తయారైనట్టు తేలిందని, రసాయనాలతో తయారైన లక్ష లడ్డూలను అయోధ్యకు పంపారని ఈ సందర్భంగా పవన్ తెలిపారు. కల్తీ నెయ్యి కేసులో దోషులెవరైనా శిక్ష పడాల్సిందేనని స్పష్టం చేశారాయన. ఆ నెయ్యిలో.. ఏ రసాయనాలు ఉన్నాయో శ్రీవారికే తెలియాలన్నారు డిప్యూటీ సీఎం. నెయ్యిలో జంతు సంబంధ రసాయనాలు ఉన్నాయని ఎన్‌డీడీబీ రిపోర్టు ఇచ్చిందని.. అది అసలు నెయ్యే కాదని సీబీఐ సిట్ రిపోర్ట్ ఇచ్చిందని తెలిపారు. ఇది స్వామివారికి కాకుండా ఇతర ఏ మతానికి జరిగినా దేశం గగ్గోలు పెట్టేదని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# మావోయిస్టు పార్టీకి భారీ దెబ్బ



- డిజిపి ఎదుట లొంగిన ప్రధాన నేతలు
- లొంగిన వారిలో దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, జగన్, గంగన్న
- 40 ఏళ్ల అజ్ఞాతానికి వీడ్కోలు పలికిన మావోలు
- వారిపై ఉన్న రివార్డును అందిస్తామన్న డిజిపి
- కేవలం ఇక 11 మంది మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని వెల్లడి

హైదరాబాద్, నేటిధాత్రి:

తెలంగాణలో నలుగురు మావోయిస్టు అగ్రనేతలు మంగళవారం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో అధికారికంగా లొంగిపోయారు. వీరిలో పొలిట్ బ్యూరో సభ్యుడు (పీబీఎం) తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ అలియాస్ కుమ్మ దాదా, సెంట్రల్ కమిటీ సభ్యుడు (సీసీఎం) మల్లారాజి రెడ్డి అలియాస్ సంగ్రామ్ అలియాస్ రంగారం, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు (ఎస్‌సీఎం) నూనె నరసింహా రెడ్డి అలియాస్ గంగన్న అలియాస్ రన్నా దాదా ఉన్నారు. 40 ఏళ్లకు పైగా అజ్ఞాతంలో పనిచేసిన ఈ అగ్రనేతలు లొంగుబాటు నిర్ణయం తీసుకున్నారు. దీంతో మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పూర్తిగా నిర్వీర్యం అయినట్లు పోలీసులు ప్రకటించారు. ఈ నలుగురి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీలో అగ్రస్థాయి బాధ్యతలు నిర్వహించిన ఇద్దరు కీలక నేతలు జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన ఇంకా 11 మంది అజ్ఞాతంలో ఉన్నారని అన్నారు. వారు కూడా త్వరలో జనజీవనంలోకి రావాలని డీజీపీ కోరారు. ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి అడవుల్లో లేరని, బయట ఎక్కడో షెల్టర్ తీసుకున్నట్లు గుర్తించామన్నారు. తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీపై రూ.25 లక్షలు, మల్లారాజి రెడ్డిపై రూ.25 లక్షలు, బడే చొక్కారావు, నూనె నరసింహా రెడ్డిలపై రూ.20 లక్షల చొప్పున నగదు రివార్డు మొత్తాన్ని వారికి అందజేస్తామని ప్రకటించారు. 2019లో తెలంగాణలో మావోయిస్టులు రిక్రూట్‌మెంట్ జరిగిందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. 1982లో సీపీఐ (ఎంఎల్) పీపుల్స్ వార్‌లో చేరిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ దండకారణ్యంలో ఆయుధ దళ కార్యకలాపాలు నిర్వహించారు. 1984-89 మధ్య సిరోంచా, పెరిమిలి ప్రాంతాల్లో దళ కమాండర్‌గా పనిచేశారు. 1989లో డివిజనల్ కమిటీ సభ్యుడిగా, 2001లో సెంట్రల్ కమిటీ, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడిగా, 2017లో సీఎంసీ ఇన్‌ఛార్జ్‌గా, తర్వాత పొలిట్ బ్యూరో సభ్యుడిగా(పీబీఎం) ఎదిగారు. 1970లలో ఉద్యమంలోకి వచ్చిన మల్లారాజి రెడ్డి..1980లలో డివిజనల్ కమిటీ, రాష్ట్ర కమిటీ స్థాయికి ఎదిగారు. 1990లో సీసీఎంగా నియమితులయ్యారు. మహారాష్ట్ర, దండకారణ్య ప్రాంతాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2007లో పీబీ సభ్యత్వం, 2010-16 మధ్య ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు. 1996లో ఆర్‌ఎస్‌యూ ద్వారా పార్టీలో చేరి 1999-2000లో ఏటూరునాగారం-మహాదేవపూర్ ప్రాంతాల్లో పార్టీ సభ్యుడిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ, ఇతర ప్రాంతీయ కమిటీలలో కీలక బాధ్యతలు చేపట్టారు. నూనె నరసింహా రెడ్డి కూడా రాష్ట్ర కమిటీ స్థాయిలో కీలక పాత్ర పోషించారు. మావోయిస్టు అగ్రనేతలు నలుగురు నేడు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయిన సంగతి తెలిసిందే. దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి(పొలిట్ బ్యూరో కమిటీ మెంబెర్).. మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్(సెంట్రమ్ కమిటీ మెంబెర్).. బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్(తెలంగాణ స్టేట్ సెక్రటరీ).. నూనె నరసింహారెడ్డి అలియాస్ గంగన్న సన్ను దాదా (స్టేట్ కమిటీ మెంబర్) పోలీసుల ముందు లొంగిపోయారు. పోలీసులు ఈ నలుగురినీ మంగళవారం మీడియా ముందుకు తీసుకువచ్చారు.

# హైకోర్టు కు కృతజ్ఞతలు

## టీయూజేఏసీ ఉమ్మడి జిల్లా నాయకులు పెండ్యాల సుమన్



**పరకాల,నేటిధాత్రి:**తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అర్హులైన ప్రతి ఉద్యమ కారునికి ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో ప్రకటించిన ఇంటి స్థలాలను ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (టియూజేఏసీ) ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు పెండ్యాల సుమన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులపై కేసులుఉండి జైలు పాలైన ఉద్యమకారులకి మొదటి ప్రాధాన్యత గా తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న వారికి రెండవ ప్రాధాన్యత గా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సోమవారం ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు,పెన్షన్లు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా హామీల అమలుకు 8 వారాలు సమయమిచ్చిన హైకోర్టు అందుకు ఉద్యమకారులు హైకోర్టుకు కృతజ్ఞతలు తెలిపారు.అభయహస్తం కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలాలు,పెన్షన్లు మంజూరు చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీతో పాటు ఫ్రీడం ఫైటర్ శాఖ అధికారులను హైకోర్టు ధర్మాసనం ఆదేశించారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆరోపిస్తూ హైకోర్టును ఆశ్రయించిన ఉద్యమ జేఏసీ నాయకులు దీనిపై విచారణ జరిపి అర్హులైన ఉద్యమకారులకు 8 వారాల్లోగా హామీలు నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన సందర్భంగా టీయూజేఏసీ వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలలో అమలు చేయాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని సుమన్ కోరారు.

# డీఫ్లోరైడ్ ప్రాజెక్టుతో పట్టణానికి మంచినీరు అందిస్తాం

## మున్సిపల్ ఛైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్



**నర్సంపేట,నేటిధాత్రి:**ఖానాపురం మండలంలోని అశోక్ నగర్ గ్రామంలోని డీఫ్లోరైడ్ ప్రాజెక్టు ద్వారా నర్సంపేట పట్టణ ప్రజలకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో మంచినీటిని అందిస్తానని మున్సిపల్ ఛైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ హామీ ఇచ్చారు.నర్సంపేట డివిజన్ ఖానాపురం మండలంలోని అశోక్ నగర్ గ్రామంలోని డీఫ్లోరైడ్ ప్రాజెక్టును నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు అధికారులతో కలిసి మున్సిపాలిటీ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్, మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా సందర్శించారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ గతంలో అనేక సంవత్సరాలు నర్సంపేట పట్టణంతో పాటు వివిధ మండలాలకు నిత్యం త్రాగునీటిని అందించిన డీఫ్లోరైడ్ ప్రాజెక్టు, గత బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పూర్తిగా ఆ ప్రాజెక్ట్ నిర్లక్ష్యానికి గురైందన్నారు.ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నర్సంపేట పట్టణానికి తాగునీటి సమస్య తీర్చాలన్న సంకల్పంతో ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశంలో డీఫ్లోరైడ్ ప్రాజెక్టు గురించి ప్రస్తావించి ప్రాజెక్టును పునరుద్ధిస్తే నర్సంపేటకు తాగునీటి సమస్య తీరుతుందనే ఉద్దేశంతో అసెంబ్లీలో ప్రస్తావించి రూ. 12కోట్ల నుండి 25 కోట్ల



నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని త్వరలోనే నిధులను మంజూరు తీసుకొచ్చి ప్రాజెక్టును పునరుద్ధించే దిశగా అడుగులు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు.అందుకు ఉదాహరణ నేడు పబ్లిక్ హెల్త్ వాటర్ డిపార్ట్మెంట్, మిషన్ భగీరథ అధికారులతో డీఫ్లోరైడ్ ప్రాజెక్టును సందర్శించడం జరిగిందన్న విషయాన్ని గుర్తుకు చేశారు.నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు 24 శ 7 తాగు నీటిని అందిస్తామని పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేందర్, మిషన్ భగీరథ డిఈ ఎస్డీ అజార్,మిషన్ భగీరథ డిటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దేవేందర్ రెడ్డి, ఏ ఈఈ వంశీ, పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుచరణ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీందర్ నాథ్, అసిస్టెంట్ ఇంజనీర్ కుమారస్వామి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ బీరం భరత్ రెడ్డి, 5వ వార్డు పొన్నాల మనీషా-ప్రకాష్, 13వ వార్డు కౌన్సిలర్ భూక్య మాత్రు రాథోడ్, 17వ వార్డు కౌన్సిలర్ సలవుదిన్ అయూబ్ ఖాన్, 22వ వార్డు కౌన్సిలర్ భాణాల ప్రసన్న-శ్రీనివాస్, 23వ వార్డు కౌన్సిలర్ వేల్పుల శ్రీలత, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, నర్సంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొంత రంజిత్, మాజీ వార్డు సభ్యులు గండి గిరి, యూత్ కాంగ్రెస్ నాయకులు కొర్ర రాహుల్, భూక్య గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో పసిపిల్లల ప్రాణాలు తీయడమేనా


## నిందితులను కఠినంగా శిక్షించాలి

## బాలానగర్ మండల బీజేపీ అధ్యక్షులు గోపాల్ నాయక్.



**బాలానగర్,నేటిదాత్రి:**నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెరలో రెండు నెలల పసికందు మృతి చెందడం ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్ట అని బాలానగర్ మండల బీజేపీ అధ్యక్షుడు గోపాల్ నాయక్ మంగళవారం అన్నారు. ఆయన మాట్లాడుతూ.. కులం పేరుతో దాడి చేసి, పసిపాప ప్రాణం పోవడానికి కారణమైన వారిని కాపాడటం సిగ్గుచేటుఢిల్లీలో రాహుల్ గాంధీ, సామాజిక న్యాయం' అని క్లాసులు చెప్తారు. కానీ.. తెలంగాణలో ఆయన పార్టీ సర్పంచ్ ఆధ్వర్యంలోనే వెనుకబడిన వర్గాలపై దాడులు జరుగుతున్నాయి. గుడికి వెళ్తే దాడులా? ఇదేనా మీ ప్రజా పాలన.. రేవంత్ రెడ్డి నిందితులను వదిలేస్తారు... ప్రశ్నించే నాయకులను అరెస్ట్ చేస్తారు! నాగర్ కర్నూల్ ఘటనపై గళం ఎత్తినందుకు నాయకులపై ఆంక్షలు విధించడం సబబు కాదన్నారు. పాప మృతికి కారణమైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

# గుడిలో గోమాత పూజలు, బయట చెత్త తింటున్న ఆవులు: భక్తిపై ప్రశ్నలు



**జహీరాబాద్,నేటిధాత్రి:**సంగారెడ్డి జిల్లాలో గోమాత పట్ల భక్తి, నిర్లక్ష్యం విరుద్ధంగా కనిపిస్తున్నాయి. నారాయణ్ ఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాల్లో గుడుల్లో గోమాతకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతుండగా, అదే సమయంలో వీధుల్లో ఆవులు చెత్త కుప్పల వద్ద ప్లాస్టిక్ కవర్లు తింటూ దర్శనమిస్తున్నాయి. గుడిలో రాయిని పూజించే భక్తి బయట జీవుల పట్ల కరుణగా మారడం లేదని, భక్తి కేవలం గుడి గడపకే పరిమితం కాకుండా, బయట జీవుల పట్ల కరుణ, బాధ్యతగా మారాలని, పరిశుభ్రత, కరుణ, బాధ్యతలే నిజమైన ఆచరణాత్మక భక్తి అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

## ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**భూపాలపల్లి,నేటిధాత్రి:**

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల 144 సెక్షన్ అమలు భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని భూపాలపల్లి ఎస్పీ తెలిపారు. జిల్లా పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల రక్షణ లో భాగంగా సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ (144 సెక్షన్) అమలు చేయనున్నట్లు తెలిపారు.

భూపాలపల్లి జిల్లా పరిధిలోని మొత్తం 08 పరీక్ష కేంద్రాల్లో(భూపాలపల్లి 02, కాటారం 02, చిట్యాల 02, మహాదేవపూర్ 01, తాడిచర్ల 01) తేది 25-02-2026 నుండి 18-03-2026 వరకు ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని ఎస్పీ తెలిపారు.పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదు.సభలు, సమావేశాలు, ర్యాలీ లు, ధర్నాలు నిషేధం.పరీక్ష కేంద్రాల నుండి 500 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు తేది 25-02-2026 నుండి 18-03-2026 వరకు ప్రతిరోజూ ఉదయం 06:00 గంటల నుండి మధ్యాహ్నం 02:00 గంటల వరకు మూసివేయాలని ఎస్పీ ఆదేశించారు.ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని ఎస్పీ హెచ్చరించారు.

# ఇక నో హెల్మెట్ నో పెట్రోల్

## ఆదేశాలు జారీ చేసిన యాదాద్రి కలెక్టర్ హనుమంతరావు



**యాదాద్రి భువనగిరి,నేటిధాత్రి:**రహదారి భద్రతే లక్ష్యంగా యాదాద్రి భువనగిరి జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించేలా ప్రోత్సహించేందుకు జిల్లా కలెక్టర్ హనుమంతరావు సరికొత్త ఆదేశాలను జారీ చేశారు. ఇకపై జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో హెల్మెట్ లేని వాహనదారులకు చుక్కెదురు కానుంది. జిల్లాలో రహదారి ప్రమాదాలను కట్టడి చేసి వాహనదారుల ప్రాణాలకు భద్రత కల్పించడానికి ఈ నిర్ణయం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశ్యంగా తెలుస్తోంది.కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా పౌరసరఫరాల శాఖ జిల్లాలోని అన్ని పెట్రోల్ బంక్ నిర్వాహకులకు కీలక సూచనలకు సంబంధించిన సర్క్యులర్ ను జారీ చేశారుఅవగాహన కల్పించిన పిదప పెట్రోల్ ... హెల్మెట్ లేకుండా పెట్రోల్ కోసం వచ్చే వాహనదారులకు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించి, తప్పనిసరిగా ధరించేలా అవగాహన కల్పించాలి. ప్రతి పెట్రోల్ బంక్ ప్రాంగణంలో హెల్మెట్ ధరించండి – ప్రాణాలను రక్షించుకోండి అనే సందేశంతో కూడిన బోర్డులను స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలి. బంక్ సిబ్బంది వాహనదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూనే, నిబంధనలు పాటించేలా చూడటం నిర్వాహకుల బాధ్యత. అంతే కాకుండా హెల్మెట్ ధరించడం కేవలం జరిమానాల నుంచి తప్పించుకోవడానికి కాదని వారి కుటుంబానికి ఇచ్చే భరోసా అని ప్రతి పౌరుడు రహదారి నిబంధనలను పాటించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు !హెల్మెట్ ధరించని వ్యక్తులు పెట్రోల్ కోసం వస్తే హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలి. అన్ని పెట్రోల్ బంకుల్లో తక్షణమే అమలు చేయాలి నిబంధనలను అతిక్రమించే యాజమాన్యాలు, వాహనదారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.కలెక్టర్ హనుమంతరావుయాదాద్రి భువనగిరి జిల్లా

# యాదాద్రి రైల్వే స్టేషన్ పరిశీలన



**యాదాద్రి,నేటిధాత్రి:** యాదాద్రి రైల్వే స్టేషన్ లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ మరియు ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు.

# ప్రజల భూమూల సమస్యలు పరిష్కారంలో లైసెన్సడు సర్వేయర్ల పాత్ర కీలకము

## కలెక్టర్ ఆదర్శ్ సురబి

ప్రభుత్వ రూల్స్ పాటించి పనిచేయాలని ఆదేశించార మండల స్థాయిలో సర్వేయర్లకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు భూ సర్వే ప్రక్రియల్లో ఎటువంటి అక్రమాలు నిర్లక్ష్యాలకు తావులేదని అలాంటివి చోటు చేసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .లైసెన్స్ సర్వేయర్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ భూ సంబంధిత సమస్యలను వేగవంతంగా పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ సూచించారుఈ సమావేశంలో సర్వే శాఖ ఏ డి శ్రీనివాస్, ఇతర సర్వే శాఖ అధికారులురెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు



**వనపర్తి ,నేటిధాత్రి:**నూతన లైసెన్సు సర్వేయర్లు నిష్పాక్షికంగాపారదర్శకంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు మంగళవారం నాడు జజిల్సర్వే శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ కలెక్టర్ కార్యాలయం లో నిర్వహించిన నూతన లైసెన్స్ సర్వేయర్లకు లైసెన్స్ ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ రెవెన్యూ తో కలిసి సర్వేయర్ లకు లైసెన్సులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదర్శ్ సురబి మాట్లాడుతూ భూ సర్వే వ్యవహారాలలో లైసెన్స్ సర్వేయర్ల పాత్ర కీలకమని అన్నారు ప్రజల భూ సమస్యల పరిష్కారంలో సర్వేయర్లు నిష్పాక్షికంగా పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు భూ వివాదాల పరిష్కారంలో

# మోడల్ స్కూల్లో పదవతరగతి విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్

## ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేసిన మణికంఠ ఫౌండేషన్

## ముఖ్య అతిథిగా ఎస్ ఐ రేఖ అశోక్



**గణపురం,నేటిధాత్రి:** గణపురం మండల కేంద్రంలో మోడల్ స్కూల్ పాఠశాలలో మంగళవారం పదవతరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు అవసరమైన ఎగ్జామ్ ప్యాడ్లను ఉచితంగా పంపిణీ చేశారు ఈ కార్యక్రమాన్ని మాణికంఠ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ మాణికంఠ గౌడ్ నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ రజిత ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య



అతిథిగా ఎస్ఐ రేఖ అశోక్ హాజరై పదవతరగతి విద్యార్థులను ప్రోత్సహిస్తూ కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు ఈ సందర్భంగా మాణికంఠ గౌడ్ మాట్లాడుతూ పదవతరగతి పరీక్షలు విద్యార్థుల జీవితంలో కీలకమైన దశ. ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంపై విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ, మాణికంఠ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు హైకోర్టు తీపి కబురు

## తెలంగాణ ఉద్యమకారులకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఉద్యమకారులు:



**కేసముద్రం,నేటిదాత్రి:**తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు, పెన్షన్ 8 వారాల్లో ఇవ్వాలని హైకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇవ్వడంతో కేసముద్రం మండల తెలంగాణ ఉద్యమకారులు సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం కేసముద్రం పట్టణంలోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సమావేశమై హైకోర్టు తీర్పు ఉద్యమకారులకు అనుకూలంగా ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చాగంటి కిషన్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు, పెన్షన్ 8 వారాల్లో ఇవ్వాలని హైకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చినందున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విధివిధానాలు ప్రకటించి, సంబంధిత జి.వో. విడుదల చేయాలని, వీటితో పాటు కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలైన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, మరణించిన ఉద్యమకారుల కుటుంబాలకు ఆర్థిక సహాయం, అర్హత ఉన్న ఉద్యమకారులకు ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. పిసిసి సభ్యులు గుగులోత్ దస్రూనాయక్ మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల ఉద్యమకారుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మాంకాల కట్టమల్లు, ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్, విద్యార్థి, యువజన జెఎసి పూర్వ కన్వీనర్ దండు శ్రీనివాస్, భట్టు శ్రీనివాస్, శివారపు శ్రీధర్, గంధసిరి సోమన్న, వంగాల అశోక్, పింగిళి శ్రీనివాస్, జనిగల కొమురెల్లి, బాలు మోహన్, వేం నరసింహారెడ్డి, సోమారపు వెంకటయ్య, జనిగల పరమేశ్వర్, చుంచు సూరయ్య, కీర్తి సమ్మయ్య, మాందాటి ఆంజనేయులు, గాండ్ల మలేంద్రం పాల్గొన్నారు.

# చనిపోయిన పాప కోసం కొవ్వొత్తులతో ర్యాలీ

## గణపురం రజక కుల సంఘం నాయకులు



**గణపురం,నేటిధాత్రి:**గణపురం మండల కేంద్రంలో నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో రజక కులస్తురాలు చంద్రకళ కుటుంబం పై దాడి చేసి రెండు నెలల చంద్రకళ కుమార్తెను కాలుతో తన్ని పాప చనిపోవడానికి కారణమైన రెడ్డి కులానికి చెందిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు పంపాలని డిమాండ్ చేస్తూ చనిపోయిన పాపకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీని నిర్వహించిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రానికి చెందిన రజక కుల సంఘం నాయకులు.ఇలాంటి దాడులు మరి ఎక్కడ కూడా జరగకుండా ఉండాలంటే నిందితులను కఠినంగా శిక్షించాలని కుల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గణపురం రజక సహకార సంఘం నాయకులు వైనాల వెంకటేశ్వర్లు, పసునూటి వెంకన్న, ఎన్నిండ్ల సమ్మయ్య, వైనాల భాస్కర్, పసునూటి రాజు, నేరెళ్ల సారయ్య, సభ్యులు పసునూటి శంకర్, నేరెళ్ల శంకర్, ఎన్నిండ్ల శంకర్, పసునూటి రాజు,ఎన్నిండ్ల శ్రీకాంత్, వైనాల లింగయ్య, పసునూటి మొగిలి, పసునూటి సాయి తేజ, మామిడి అజయ్, కాశీ మల్లు, రాచర్ల శంకర్ పాల్గొన్నారు.

# సమ సమాజ స్థాపన కోసం నిరంతరం పోరాడిన మహత్తర శక్తి ఈశ్వరీబాయి

## ఇస్మాలప్ప ప్రముఖ న్యాయవాది, మాల మహా నాడు రాష్ట్ర కార్యదర్శి



**జహీరాబాద్,నేటిధాత్రి:** జహీరాబాద్ ఫిబ్రవరి 24:సమ సమాజ స్థాపన కోసం నిరంతరం పోరాడిన మహత్తర శక్తి ఈశ్వరీబాయి అని ప్రముఖ న్యాయవాది, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి డి. ఇస్మాలప్ప అన్నారు.సోమవారం రంజోల్ గురుకుల బాలికల పాఠశాల,మంగళవారం మండల పరిధిలోని హోతి–కె బాలికల గురుకుల పాఠశాల కళాశాలలో విద్యార్థులకు ఈశ్వరి బాయి 35 వ వర్ధంతి సందర్భంగా మహనీయుల స్ఫూర్తి అనె శీర్షిక పై వ్యాస రచన కార్యక్రమన్ని పాఠశాల ప్రిన్సిపాల్ సురేఖ, అధ్యాపక బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్మాలప్ప మాట్లాడుతూ..తెలుగు నేలపై పీడిత ప్రజల హక్కులు, అవకాశాల కోసం, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కలలు కన్న సమ సమాజ స్థాపన కోసం నిరంతరం పోరాడిన మహత్తర శక్తి ఈశ్వరీబాయి. సమాజంలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కోసం పోరాడుతున్న ప్రతి ఒక్కరి దేహంలో అణువణువునా స్ఫూర్తిని రగిలిస్తున్న రణ నినాదం ఈశ్వరీబాయి అని అన్నారు. ఈశ్వరీబాయి సికింద్రాబాద్లోని చిలకలగూడకు చెందిన బల్లెపు రామస్వామి, రాములమ్మ దంపతులకు 1918వ సంవత్సరం డిసెంబర్ 1న జన్మించారు. ఆమెకు 13వ ఏట



పూణేకు చెందిన వైద్యుడితో వివాహం జరిగింది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలుగా పనిచేసి కుల వివక్షకు, బానిసత్వానికి వ్యతిరేకంగా, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆమె దశాబ్దాల పాటు చేసిన పోరాటం, ముఖ్యంగా అసెంబ్లీలో ఆమె గొంతు ఎలుగెత్తిన తీరు ఆమెను 'గొప్ప నాయకురాలు అని అన్నారు. తరతరాలుగా బానిసత్వంలో, వెట్టిచాకిరిలో మగ్గుతూ బాధలనుభవిస్తున్న బలహీన వర్గాల ప్రజల అభివృద్ధిని కాంక్షించి ఉద్యమాలలో పాల్గొన్నారని,బలహీన వర్గాల అభివృద్ధి కోసం, కృషి చేసిందన్నారు. ఈమె 1918 డిసెంబర్ 1వ తేదీన నాటి నిజాం సంస్థానం (నేటి తెలంగాణ రాష్ట్రంలోని) సికింద్రాబాద్ లోని చిలకలగూడలో జన్మించారు. బల్లెపు రాములమ్మ, బలరామస్వామిల కుమార్తె ఈమె. బలరామస్వామి 'నిజాం స్టేట్ రైల్వేశాఖ'లో పనిచేశారు. తను చేసేది చిరుద్యోగమైనా పిల్లలను కష్టపడి చదివించారు రామస్వామి. అప్పటికీ చదువుకునే బాలికలు తక్కువే. అయినప్పటికీ కుమార్తె ఈశ్వరీబాయిని విద్యావంతురాలిని చేశారాయన. యస్.పి.జీ. మిషనరీ పాఠశాలలో ప్రాథమిక విద్యను, కీస్ హైస్కూలులో మాధ్యమిక విద్యను అభ్యసించారు అనె విషయాలను విద్యార్థులకు వివరించారు.

### విద్యార్థులలు ఈశ్వరి బాయి లాంటి మహనీయుల స్ఫూర్తి తో ముందుకు సాగాలి



సురేఖ హోతి– కె బాలికల గురుకులం ప్రిన్సిపాల్ఈ కార్యక్రమంలో హోతి–కె బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతు.. నేటి ఆధునిక యుగంలో విద్యార్థులు జెట్టి ఈశ్వరి బాయి స్ఫూర్తి తో ముందుకు సాగాలని, ఎన్ని ప్రతికుల పరిస్థితులు ఎదురైనా దీటుగా ఏదురోడ్డి మహిళా హక్కుల సాధనకై కృషి చేసిందని విద్యార్థులు కూడా పట్టుదలతో చదివి సమాజంలో ఉన్నత స్థానం లో ఉండాలని నేను కూడ ఇలాంటి మహానీయుల స్ఫూర్తి తోనె చదువుకొని ఉన్నత స్థానం లో విధులు నిర్వరిస్థిస్తున్నని అన్నారు. ఈ కార్యక్రమంలో హై కోర్టు న్యాయవాది చందు మార్షల్, జర్నలిస్టులు, శ్రీనివాస్,చెందు కుమార్, మహేందర్,హోతి– కె గురుకుల పాఠశాల అధ్యాపకులు నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు రామ దేవి, కవిత, రంజోల్ గురుకుల ప్రిన్సిపాల్ కె. సృజన, షామా అంజూమ్, ఉపాధ్యాయులు సోనీ,ప్రసన్న లక్ష్మి, శ్రీదేవి, కె మంజుల, విద్యార్థుల పాల్గొన్నారు.


# పసిపాప మృతికి కారణమైన అగ్రకులోన్మాదులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి

## సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు ఇ. శ్రీశైలం




**కొత్తగూడ, నేటిధాత్రి:** నాగర్ కర్నూల్ జిల్లా లో పసిపాప మృతికి కారణమైన అగ్రకులోన్మాదులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు ఇ. శ్రీశైలం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలోనే జరిగిన ఈ దారుణ ఘటన సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేసిందని నాగర్కర్నూల్ జిల్లా తాండూర్ మండలంలోని కుమ్మెర మల్లన్న జాతర సందర్భంగాచాకలి(రజక )కు టుంబంపై ఆధిపత్య రెడ్డి కుల దౌర్జన్యం ప్రదర్శించి, ఐదు నెలల పసికందును కాళ్లతో తన్ని, గొంతు నులిమి చంపడం అమానుషం అని, క్రూరత్వానికి, కుల దురహంకారానికి నిదర్శనంగా ఉన్న ఈ ఘటనను సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కమిటీ నాయకులు ఇ శ్రీశైలం తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనను కేవలం ఒక కుటుంబంపై జరిగిన దాడిగా కాకుండా, మహిళల గౌరవంపై, దళిత, బీసీ సమాజంపై, మానవ హక్కులపై జరిగిన దాడిగా చూడాలని వారు అన్నారు. ఏమాత్రం జవాబుదారీతనం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలనీ, నిందితులు ఉద్యాల శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి ఇతర అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.మల్లన్న దర్శనం కోసం వచ్చిన ఆ కుటుంబం తమ దగ్గర డబ్బులు లేవని, బయట నుంచే దర్శనం చేసుకుంటామని చెప్పినా వినకుండా ఆధిపత్య కుల, వర్గ అహంకారంతో దళిత మహిళను అసభ్య పదజాలంతో దూషించడం, ఆమెను, ఆమె భర్తను గదిలో బంధించి కులం పేరుతో అవమానించడం, దాడి చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయం. ఒక తల్లి కళ్లముందే ఐదు నెలల పసికందును హత్య చేయడం మానవత్వానికకే మచ్చ, అత్యంత క్రూరత్వం ఈ ఘటన జరిగి ఐదు రోజులు గడిచినా కూడా నిందితులను అరెస్ట్ చేయకపోవడం అత్యంత ఆందోళనకరం. అధికార పార్టీకి చెందిన వ్యక్తులు కావడంతో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు బలపడుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధుల మద్దతుతో నిందితులు తప్పించుకుంటున్నారనే వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రతిపక్ష నేతలు తమ మౌనంతో ఇటువంటి నేరాల పట్ల, సామాజిక అణచివేత పట్ల ఆమోదాన్ని తెలియజేస్తున్నాయి.మహిళలపై, అణగారిన వర్గాలపై జరుగుతున్న ఇలాంటి దాడులు సమాజానికి ప్రమాదకర సంకేతాలు ఇస్తున్నాయని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, కులనిర్మూలనకు పోరాడాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగించాలని


# కోటంచ ఆలయ డైరెక్టర్ కు గ్రామపంచాయతీ పాలకవర్గం సన్మానం.



**చిట్యాల,నేటిదాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో శ్రీ కోటంచ లక్ష్మి నర్సింహా స్వామి ఆలయ కమిటీ డైరెక్టర్ గా ఎన్నికైన దొడ్డి కిష్టయ్య ను మంగళవారం రోజున గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో సర్పంచ్ తవవుటం లక్ష్మి, ఉపసర్పంచి బుర్ర వెంకటేష్ గౌడ్, వార్డ్ మెంబర్లు తౌటం నవీన్, వేల్పుల లక్ష్మి, శ్రీలత,అనూష, మైదం శ్రావ్య, నిర్మల, సలిమ బేగం, శనిగరపు మొగిలి తదితరులు పాల్గొన్నారు.

# మండల అభివృద్ధికి ఎంపీ సురేష్ షెట్కార్ విశేషంగా నిధులు మంజూరు

## 28 గ్రామల్లో మహిళ శక్తి భవనాలు మంజూరు చేశారు : మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి ..కోటి 20 లక్షల నరేగా నిధులతో మండలంలో రోడ్లు, మురికి కాలువల నిర్మాణం : మాజి జడ్పిటిసి భాస్కర్ రెడ్డి



**జహీరాబాద్,నేటిధాత్రి:** జహీరాబాద్: న్యాల్కల్ మండల అభివృద్ధికి స్థానిక పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షెట్కార్ ఉదారంగా నిధులను మంజూరు చేసస్తూ తన స్వంత మండలంగా భవిస్తూ అభివృద్ధి పనుల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అయినప్పటికీ ఉపాధి హామీ పథకం 2024–2025 సంవత్సరనికి గాను 1.20 కోట్లు, 2025–2026 ఏడాదిలో 320–00 లక్షలు, 28 గ్రామ పంచాయతీ లకు మహిళా శక్తి భావనలు మంజూరు అయినయని న్యాల్కల్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎంపీ షెట్కార్ ప్రత్యేక నిధులు, నరేగా నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరిస్తూ సీసీ రోడ్ల కోసం కోటి ఇరవై లక్షలు, 60 లక్షల తాగు నీటి సరఫరా కోసం బోర్ మోటర్లు ఎంపీ ల్యాండ్స్ నిధులు నుండి, 2025--2026 సం రనికిన్యాల్కల్ 50–00లక్షలు, న్యాల్కల్ ఆర్టీసీ బస్టాండ్ 15 లక్షలు డిఎంటిఎఫ్ నిధులు, ఐదు కోట్ల అరవై ఐదు లక్షలు నిధులు మంజూరు అయి కొన్ని పనులు అయినయని, మరికొన్ని పనులు కొనసాగుతున్నాయని, నియోజకవర్గం నిధులు ఏంజి ఎన్ఆర్ఈజిఎస్ లో డాక్టర్ చంద్ర శేఖర్ ఇంచార్జి, మంత్రివర్యులు కూడా న్యాల్కల్ మండలనికి కోటి రూపాయలు కేటాయించారని, ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్, ఇంచార్జి డాక్టర్ చంద్ర శేఖర్ లు ఇద్దరు కలసి న్యాల్కల్ మండలానికి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. నియోజకవర్గం ముఖ్య నాయకుల సహకారం, మండల నాయకులు ఐక్యతతో ఉన్నందున ఎక్కువ నిధులు వస్తున్నాయని, కాంగ్రెస్ పార్టీకి, ఎంపీ షెట్కార్, ఇంచార్జి చంద్రశేఖర్ కి నియోజకవర్గం నాయకులకు మండలం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ లను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు.



**చిట్యాల,నేటిదాత్రి:** జయ శంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని కాంగ్రెస్ నాయకులు మంగళవారం రోజున భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర. కొమురయ్యని, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ ని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన చిట్యాల కాంగ్రెస్ నాయకులు, ఈ కార్యక్రమంలో చిలుకల రాయకొమురు, కట్కూరి నరేందర్ కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ గంగాధర్ రవీందర్,బండి రాజు, మాటూరి లంవన్ బాబు పాల్గొన్నారు,

# కుమ్మెర ఘటన బాధ్యులపై ఎస్సీ ఎస్టి అట్రాసిటీ కేసులు పెట్టాలి

## తెలంగాణ అంబేద్కర్ సంఘం మంగపేట మండల అధ్యక్షులు.యెంపెల్లి వీరాస్వామి బోడ రామచంద్రం,,మంగపేట మండల ప్రధాన కార్యదర్శి



**మంగపేట,నేటిధాత్రి:** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతరలో ఆలయానికి వెళ్లిన చాకలి కులం వారిపై కుల వివక్షత తో రెండు నెలల పసికందును అగ్ర కుల పెత్తం దారుడు శ్రీనివాస్ రెడ్డి కాలితో తన్ని హత్య చేసిన ఘటనకు బాధ్యుడైన అతని తో పాటు, మధుసూదన్ రెడ్డి, సతీష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కన్ని రెడ్డి మరికొందరిపై ఎస్సి /ఎస్టి అట్రాసిటీ నమోదు చేసి, వెంటనే అరెస్ట్ చేయాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం మంగపేట మండల కమిటీ ఆధ్వర్యంలో మంగపేట మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన తెలియజేయడం. జరిగింది. ఈ ఘటనకు బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయని యెడల రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని డిమాండ్ చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమం లో అంబేద్కర్ సంఘం మంగపేట మండల నాయకులు కప్ప ముకుందాం, రవి, నానీ,కమలాపురం గ్రామ అధ్యక్షులు దాసరి బుజ్జి, ఉపాధ్యక్షులు గోలి విజయ, శేకర్, గ్రామ నాయకులు సమ్మయ్య,తదితరులు పాల్గొన్నా

# చిట్యాల మండలంలో 'నో హెల్మెట్ నో ఫ్యూయల్' కార్యక్రమం.




**చిట్యాల,నేటిదాత్రి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా చేపట్టిన 'అరివే ఆలివ్' కార్యక్రమంలో భాగంగా నేడు చిట్యాల మండల కేంద్రంలోని పెట్రోల్ పంపుల వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిట్యాల సి ఐ మల్లేష్ మరియు ఎస్ఐ శ్రావణ్ కుమార్ గారి సూచనలతో, మండలంలోని నాలుగు ప్రధాన పెట్రోల్ బంకుల్లో కానిస్టేబుళు అస్సాం మరియు లాల్ సింగ్ లు ఈ సందర్భంగా పెట్రోల్ పంపుల వద్ద "నో హెల్మెట్ – నో ఫ్యూయల్" (హెల్మెట్ లేనిదే పెట్రోల్ లేదు) అనే స్టిక్కర్లను అతికించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేని వాహనదారులకు పెట్రోల్ పోయకూడదని బంక్ యజమానులకు మరియు సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ప్రాణ రక్షణే ధ్యేయం:లి రోడ్డు ప్రమాదాల నివారణకు మరియు వాహనదారుల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీస్ అధికారులు కోరారు.సహకరించాలని విజ్ఞప్తి:లి ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు మరియు పెట్రోల్ బంక్ యజమానులు పోలీసులకు సహకరించి ప్రమాద రహిత సమాజానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

# నిందితులపై హత్య కేసు నమోదు చేయాలి

## పసిపాప మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి
## చేవెళ్ల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు సున్నపు ప్రవీణ్



**నేటిధాత్రి,చేవెళ్ల:** నాగర్ కర్నూల్ జిల్లా, కుమ్మెర జాతరలో పసిపాప మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని చేవెళ్ల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు సున్నపు ప్రవీణ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... నాగర్ కర్నూల్ జిల్లా, కుమ్మెర జాతరలో రజక కుటుంబాలను అడ్డుకోవడంతో పాటు, పసి పాపను కాలుతో తొక్కి చంపడం బాధాకరమన్నారు. రజక కులానికి చెందిన చంద్రకళ కుటుంబంతో మల్లన్న దేవుని దర్శనానికి వెళుతుండగా దర్శనం టిక్కెట్ రశీదు ఇవ్వాలని కొంతమంది అగ్రకులానికి చెందిన వారు అడ్డుకొని, రెండు నెలల పసికందు ఉందని కూడా చూడకుండా దాడికి పాల్పడ్డారని, ఈ దాడిలో రెండు నెలల పసి పాప మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. పసిపాపమును కాలుతో తొక్కి చంపిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులం పేరుతో వివక్షత చూపించి ఆలయ ప్రవేశాన్ని అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధమని, నిందితులపై హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

# డైరీ క్యాలెండర్ ఆవిష్కరణఎమ్మెల్యే జీఎస్సార్



**భూపాలపల్లి, నేటిధాత్రి:** మంగళవారం భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అధికారుల డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు డైరీ, క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ విధానాలను ప్రజలకు సమర్థవంతంగా చేర్చడంలో గెజిటెడ్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజా సేవలో నిబద్ధత, పారదర్శకత, బాధ్యతతో పనిచేస్తూ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం చేయాలని సూచించారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందని తెలిపారు. ఉద్యోగుల డైరీ క్యాలెండర్ ప్రతి అధికారి పనితీరుకు మార్గదర్శకంగా ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు విజయలక్ష్మి ఆ.ర్టి.ఓ సంధాని డిపిఆర్ఓ శ్రీనివాస్ హార్టికల్చర్ అధికారి సునీల్, పంచాయత్ రాజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి కమిటీ ఎన్నిక

## ముఖ్య అతిథులుగా హాజరైన సర్పంచ్ చాట్ల విజయ, ఉప సర్పంచ్ ఎర్రబెల్లి హిమబిందు



**మొగుళ్లపల్లి ,నేటిధాత్రి:**జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో 3వ అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ రజిత ఆధ్వర్యంలో ఆరోగ్యలక్ష్మి కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మొగుళ్ళపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్ దంపతులు, ఉప సర్పంచ్ ఎర్రబెల్లి హిమబిందు-కోటేశ్వర్ రావు దంపతులు హాజరైనారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాటు చేసిన అంగన్వాడీ కేంద్రంలో ఆహార పదార్థాల పంపిణీ, అనుబంధ పోషకాహారం, పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, అనుబంధ పోషకాహారం, ఇమ్యూనైజేషన్, పూర్వ ప్రాథమిక విద్య తదితర అంశాలపై ఈ సందర్భంగా వారు అంగన్వాడీ టీచర్ మోటే రజితతో చర్చించారు. అనంతరం వారు బాలింతలు, గర్భిణీ స్త్రీలు, పిల్లలతో కలిసి ముచ్చటించారు. ఆరోగ్యలక్ష్మి కమిటీని 11 మంది సభ్యులతో ఐసీడీఎస్ సూపర్వైజర్ రజిత ఎన్నుకున్నారు. చైర్ పర్సన్ గా గ్రామ సర్పంచ్ చాట్ల విజయ, కన్వీనర్ గా అంగన్వాడీ టీచర్ మోటే రజిత, సభ్యులుగా ఆశా వర్కర్ అరుణ, గర్భిణీ స్త్రీ భాషిక సంధ్య, ఏడు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లల తల్లి వేముల మానస, మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల పిల్లల తల్లి శైలజ, వివో సభ్యులు రమ, కొమురమ్మ, కిశోర బాలిక శ్వేత మరియు పిల్లల తల్లులు, పిల్లలు మరియు గ్రామ పెద్దలు ఈ కార్యక్రమానికి హాజరైనారు.

# 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల,నేటిధాత్రి:**మంచిర్యాల జిల్లాలో జరుగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య లతో కలిసి మండల విద్యాధికారులు, ముఖ్య పర్యవేక్షకులు,శాఖ అధికారులు,రూట్ అధికారులతోహావార్షిక పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 14 నుండి ఏప్రిల్ 16వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని,ఇందు కొరకు జిల్లాలో 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.9 వేల 703 మంది రెగ్యులర్,45 మంది ఒక్కసారి అనుత్తీర్ణులైన విద్యార్థులు పరీక్ష రాయనున్నారని,పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్,సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు.పరీక్ష రోజున పోలీస్ స్టేషన్ నుండి పరీక్ష కేంద్రానికి ప్రశ్నాపత్రాలు తరలించడం జరుగుతుందని,పరీక్షా కేంద్రం గేటు బయట క్లాక్ రూమ్ ఏర్పాటు చేయాలని,ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా అధికారులు విధులు నిర్వహించాలని తెలిపారు.మాల్ ప్రాక్టీస్ సంబంధిత వార్తలు ప్రసారమైతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని,ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.పరీక్ష నిర్వహణలో ఏమైనా ఇబ్బంది తలెత్తితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని,పరీక్షా కేంద్రంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు.పరీక్ష కేంద్రాలకు కేటాయించిన ప్రకారంగా ప్రశ్నాపత్రాలు వెళ్లేలా అధికారులు పర్యవేక్షించాలని,పరీక్షా కేంద్రంలోనికి మొబైల్ ఫోన్లను అనుమతించకూడదని,అభ్యర్థులను లోనికి అనుమతించ సమయంలో పకడ్బందీగా తనిఖీ నిర్వహించాలని తెలిపారు.పరీక్ష సమయం ముగిసే వరకు విద్యార్థులను బయటకు అనుమతించకూడదని సూచించారు.పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టి.యూ.ఎఫ్ ఉమ్మడి రంగారెడ్డి చైర్మన్‌గా యాలాల మహేశ్వర్ రెడ్డి



**నేటిధాత్రి, చేవెళ్ల :**తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చైర్మన్‌గా యాలాల మహేశ్వర్ రెడ్డినియామకం అయ్యారు. మంగళవారం నగరంలో కేంద్రకమిటి కార్యాలయంలో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం తరఫున ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చైర్మన్‌గా, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్‌గా యాలాల మహేశ్వర్ రెడ్డి గారిని నియమించినట్లు, ఫోరం రాష్ట్ర ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్ మహేశ్వర్ రెడ్డికి నియామకాపత్రం అందజేశారు. ఎంతో నమ్మకంతో తనకు ఇచ్చిన గౌరవప్రదమైన బాధ్యతను నిర్వహిస్తూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ కారులను ఐక్యం చేస్తూ, వారి ఆత్మగౌరవం మరియు సంక్షేమం కోసం కృషి చేస్తానని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఉద్యమ కారుల సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా పనిచేస్తానని వెల్లడించారు. ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు వెంటనే కార్యాచరణ ప్రారంభించాలని అన్నారు.

# భక్తాంజనేయ స్వామి దేవాలయం 15వ వార్షికోత్సవంలి

## దేవాలయ కమిటీ చైర్మన్ పెండెం రాజేందర్



**మొగుళ్ళపల్లి,నేటిధాత్రి:**జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు దేవాలయ కమిటీ చైర్మన్ పెండెం రాజేందర్ తెలిపారు. గత మూడు రోజుల నుండి గ్రామస్తులు, భక్తుల కోలాహలం మధ్య శ్రీ భక్తాంజనేయ స్వామి వార్షికోత్సవ వేడుకలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పెండెం రాజేందర్ మాట్లాడారు. శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం 15వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేసినటువంటి శాశ్వత కళ్యాణ పంచలోహ విగ్రహ దాతలకు, శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో గల దేవతలకు కళ్యాణం చేయించినటువంటి బ్రహ్మశ్రీ సువర్ణ శ్రీధర్ శర్మ రంగాచార్యుల బృందానికి, వార్షికోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అహర్నిశలు కృషి చేసిన దేవాలయ కమిటీ సభ్యులకు, ఆలయ అర్చకులు తుమ్మ కృష్ణమూర్తికి, అన్నదాత కొమరోజు బిక్షపతికి, హిందూ బంధువులకు, భక్తులకు, మహిళలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయ సహకారాలు అందించిన గ్రామ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ భక్తాంజనేయ స్వామి సామూహిక దేవతల అనుగ్రహంతో ప్రజలంతా సుఖశాంతులతో, అష్టైశ్వర్యాలతో, పాడి పంటలతో, పిల్లాపాపలతో, కుటుంబ సభ్యులతో కలిసి మెలిసి ఆరోగ్యంగా నిండు నూరేళ్ళు వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా దేవాలయంను సందర్శించిన సందర్భంగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు.

# పొలంలో విద్యుత్ షాక్ తగిలి చిన్నారి మృతి



**నేటిధాత్రి,చేవెళ్ల:**అడవి పందుల నుంచి మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు వేసిన విద్యుత్ కంచె తగిలి 7ఏళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ సంఘటన మంగళవారం చేవెళ్ల మండలం మిర్జాగూడ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మిర్జాగూడ గ్రామానికి చెందిన ఇబ్రహీంపల్లి యాదయ్య -- అనిత దంపతులకు కుమార్తె వర్షిణి (07), కుమారుడు రుత్విక్ (05) ఇరువురు సంతానం. మంగళవారం ఉదయం పెద్దమ్మ మౌనికతో కలిసి పొలం వద్దకు వెళ్లారు. కాగా ఇద్దరు పిల్లలు ముందుగా పరుగెత్తి, అడవి పందుల నుంచి మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు పెదనాన్న మల్లేష్ వేసిన విద్యుత్ కంచెకు తగిలారు. ఇద్దరు పిల్లలకు విద్యుత్ షాక్ తగిలింది. ఇది గమనించిన పెద్దమ్మ మౌనిక చుట్టూ ప్రక్కల ఉన్న రైతుల సహాయంతో చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఐతే అప్పటికే వర్షిణి (07) మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. వర్షిణి తల్లిదండ్రుల రోదనలు పలువురుని కంటతడి పెట్టించాయి. గాయాలైన రుత్విక్ ను మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన బాలిక (వర్షిణి) చేవెళ్ల పట్టణంలోని నవచైతన్య ప్రైవేట్ స్కూల్‌లో యూకేజీ చదువుతుంది.

# కుమ్మెర సంఘటనలో నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి

## వేముల మహేందర్ గౌడ్




**మొగుళ్ళపల్లి,నేటిధాత్రి:** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో బీసీ మరియు దళిత కుటుంబంపై దేవుని గుడిలోనే కులం పేరుతో దూషిస్తూ..అమానుషంగా దాడి చేసి రెండు నెలల పసికందును హత్య చేసిన వారిపై తక్షణమే హత్య కేసు మరియు మరియు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో ఆదిపత్య అగ్రకుల రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు అదే గ్రామానికి చెందిన బీసీ రజక కులానికి మరియు దళిత కుటుంబానికి చెందిన ఒకే కుటుంబంపై దేవున్ని దర్శించుకోవడం కోసం వెళ్ళిన గణేష్ చంద్రకళ దంపతులను కులం పేరుతో దూషించడమే కాకుండా భౌతికంగా దాడి చేసి చంకలో ఉన్న రెండు నెలల పసి గుడ్డును చంపేయడం అత్యంత విషాదకరమని, ఇలాంటి సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి, దోషులు ఏ స్థాయిలో ఉన్న ఏలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా తక్షణమే అరెస్టు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పేద కుటుంబానికి చెందిన రజక కులస్తుడైన గణేష్ దళిత అమ్మాయిని ఆదర్శ వివాహం చేసుకొని గుడిలోకి అడుగుపెట్టిన పాపానికి అగ్రకులాల చేతిలో దాడికి గురవడమే కాకుండా తన బిడ్డను కోల్పోవడం అత్యంత బాధాకరమని, రాష్ట్రంలో మానవత్వం ఉన్న ప్రతి మనిషి ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత పోలీస్ శాఖదేనని తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు బాధిత కుటుంబానికి బీసీ సంక్షేమ సంఘం అండగా ఉంటుందన్నారు.

# గ్రామస్థాయి పరిపాలనలో జిపిఓల పాత్ర కీలకం

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య



**మంచిర్యాల,నేటిధాత్రి:**ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ గ్రామస్థాయి పరిపాలనలో జిపిఓల పాత్ర కీలకమైనదని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య అన్నారు.మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిపిఓ/ఆర్ ఐ యాప్ పై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి తహసిల్దార్ మల్లికార్జున్,ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్ లతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గతంలో వి.ఆర్.ఓ., వి.ఆర్.ఏ. లుగా సేవలు అందించిన వారు గ్రామంలో జరిగే అన్ని విషయాలను ప్రభుత్వానికి అందించి ప్రజా సంక్షేమం కోసం చర్యలు తీసుకునేందుకు గ్రామ పాలన అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు.గ్రామస్థాయిలో ధ్రువపత్రాల జారీ,లబ్ధిదారుల ఎంపిక జిపిఓల ద్వారా చేయడం జరుగుతుందని తెలిపారు.కులం,ఆదాయం ఇతర ధ్రువపత్రాల కొరకు మీ సేవా ద్వారా అందిన దరఖాస్తులను యాప్ ద్వారా పరిశీలించి పరిష్కరించవచ్చుని,తద్వారా సమయం ఆదావుతుందని, పారదర్శకంగా ఉంటుందని తెలిపారు.భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటుందని,ఈ క్రమంలో ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని తెలిపారు.దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని,గత అనుభవం దృష్ట్యా రికార్డులపై గ్రామ పాలన అధికారులు అవగాహన కలిగి ఉన్నారని,ఈ మేరకు సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని,పారదర్శకంగా విధులు నిర్వహించాలని తెలిపారు.గ్రామస్థాయిలో సర్వేయర్ కు సహాయకులుగా వెళ్లవలసి ఉంటుందని, తద్వారా గ్రామ సంబంధిత భూములపై అవగాహన పొందుతుందని,గ్రామ పాలన అధికారులు తమ విధులు, అధికారాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.విరాసత్,ముటేషన్ల విషయంలో మోకా మీద విచారణ జరపాలని సూచించారు.విధుల విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత వైద్య శిబిరం.

## మండల వైద్యాధికారిణిడాక్టర్ నాగరాణి.



**మొగుళ్ళపల్లి,నేటిధాత్రి:** భూపాలపల్లి జిల్లామొగుళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని కొరికిశాల గ్రామంలోని KGBV మరియుGMS పాఠశాల లో



ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ నాగరాణి గారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యం శిబిరాన్ని నిర్వహించడం జరిగినది .ఈ కార్యక్రమంలో రెండు పాఠశాలలో కలిపి 75 మంది పిల్లలకి వైద్య పరీక్షలు చేసి, ఉచిత మందులు ఇవ్వడం జరిగినది. అదేవిధంగా ఇద్దరు జ్వర పీడితులను గుర్తించి రక్త నమూనాలు తీసి ల్యాబ్ కు పంపినారు. డాక్టర్ నాగరాణి పిల్లలకి ఆరోగ్యముపై అవగాహన కల్పించడం జరిగింది .వేడివేడి ఆహార పదార్థాలు తినాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, చేతులను శుభ్రంగా కడుకోవాలని పిల్లలకి ఆరోగ్యం పై అవగాహన కల్పించడం జరిగినది. అదే విధముగా పిల్లలతో కలిసి భోజనం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాకేష్, చైతన్య ,సూపర్వైజర్ సునీత, హెల్త్ అసిస్టెంట్ బిక్షపతి, ఏఎన్ఎం శ్రీలత, ఆశ లావణ్య, Anm రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నల్లగండ్లలో 1000 కుటుంబాలకు ప్రెజర్ కుక్కర్ల పంపిణీ



**శేరిలింగంపల్లి,నేటిధాత్రి:**నల్లగండ్ల డివిజన్ ప్రజల సంక్షేమమే నా ధ్యేయమని, ప్రతి ఇంటికీ అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్ స్పష్టం చేశారు. మంగళవారం డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి, కేశవ నగర్ ప్రాంతాల్లో సుమారు 1000కి పైగా ప్రెజర్ కుక్కర్లను ఆయన స్వయంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సురేందర్ మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో ఆనందం నింపడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక మహిళలు, వృద్ధులు తమ సమస్యలను విన్నవించుకోగా, ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. "ప్రజల కష్టాలు నా సొంత కష్టాలుగా భావిస్తాను. ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలన్నదే నా తపన" అని ఆయన అన్నారు.ఈ సేవా కార్యక్రమం కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితం కాదని, నల్లగండ్ల, గుల్మోహన్ పార్క్, నేతాజీ నగర్, గోపనపల్లి, గోపనపల్లి తాండా, ఎన్టీఆర్ నగర్, బసవతారక నగర్ సహా డివిజన్ వ్యాప్తంగా ఉన్న ప్రతి కుటుంబానికి ప్రెజర్ కుక్కర్లు అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు.సురేందర్ సేవా గుణాన్ని కొనియాడుతూ స్థానిక మహిళలు, యువకులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల ఆశీర్వాదమే తన బలమని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా సేవకే తన జీవితం అంకితం చేస్తానని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## డయాబెటిస్ ఉన్నవారికి అద్భుతంగా

# పనిచేసే మూలికలు..



మారిన జీవనవిధానం, ఆహారపు అలవాట్ల కారణంగా తలెత్తే దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల్లో డయాబెటిస్ కూడా ఒకటి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఈ సమస్య బారిన పడుతున్నారు. డయాబెటిస్ బారిన పడితే జీవితాంతం మందులు మింగాల్సిందే. అంతేకాకుండా రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉండడం వల్ల శరీరంలో ఇతర అవయవాల ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. కనుక డయాబెటిస్ ను ఎల్లప్పుడూ అదుపులో ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొన్ని రకాల మూలికలను వాడడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను సహజంగా అదుపులో ఉంచుకోవచ్చని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. వీటిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడడంతో పాటు తీపి తినాలన్న కోరిక కూడా తగ్గుతుందని వారు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ మూలికలను తీసుకోవడం వల్ల అడాప్టోజెన్ ఒత్తిడి తగ్గడంతో పాటు జీవక్రియ కూడా మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. రక్తంలో చక్కెర స్థాయిలను సహజంగా అదుపులో ఉంచే మూలికలు ఏమిటో.. ఇప్పుడు తెలుసుకుందాం. బ్లడ్ షుగర్ మానిటర్స్

### మెంతులు, దాల్చిన చెక్క..

రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో మెంతులు మనకు ఎంతో సహాయపడతాయి. వీటిలో కరిగే ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది చక్కెర శోషణను నెమ్మదిస్తుంది. మెంతులను తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీతో పాటు ఫాస్టింగ్ గ్లూకోజ్ స్థాయిలు, శరీర జీవక్రియ కూడా మెరుగుపడుతుంది. క్రమం తప్పకుండా మెంతి నీటిని తీసుకోవడం, మెంతులను నానబెట్టి తీసుకోవడం, వంటల్లో మెంతులను వాడడం వల్ల టైప్ 2 డయాబెటిస్ అదుపులో ఉంటుంది. రోజూ అర టీ స్పూన్ దాల్చిన చెక్క పొడిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సామర్థ్యం పెరుగుతుంది. భోజనం తరువాత వచ్చే గ్లూకోజ్ స్పైక్స్ తగ్గుతాయి. ఓట్ మీల్, స్మూతీ, మసాలా టీ వంటి వాటితో దాల్చినచెక్క పొడిని కలిపి తీసుకోవడం వల్ల రుచిగా ఉండడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. అయితే దాల్చిన చెక్క ప్రతికూల ప్రభావాలను కూడా చూపిస్తుంది కనుక దీనిని తక్కువ మోతాదులో తీసుకోవడం చాలా అవసరం.

### పొడపత్రి, కాకరకాయ..

అలాగే మధునాశిని అని పిలువబడే మూలికను తీసుకోవడం వల్ల తీపి తినాలనే కోరిక తగ్గుతుంది. దీనిని పొడపత్రి అని కూడా పిలుస్తారు. ఈ మొక్క ఆకులను నమలడం లేదా టీ లో వేసి తీసుకోవడం వల్ల చక్కెర శోషణ తగ్గుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో కాకరకాయ కూడా మనకు సహాయపడుతుంది. పరగడుపున కాకరకాయ జ్యూస్ తాగడం వల్ల డయాబెటిస్ అదుపులో ఉంటుంది. తులసి ఆకులను నేరుగా నమలడం లేదా కషాయం చేసి తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్తాయిలు సమతుల్యంగా ఉంటాయి. తులసి ఆకులను తీసుకోవడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. కాలేయ పనితీరు మెరుగుపడుతుంది. కార్టిసాల్ స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. అలోవెరా జ్యూస్ ను తాగడం వల్ల ఫాస్టింగ్ గ్లూకోజ్ స్థాయిలు తగ్గుతాయి. పేగుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. జ్యూస్ మాత్రమే కాకుండా అలోవెరా సప్లిమెంట్స్ ను తీసుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది.

### జాగ్రత్తలు తప్పనిసరి..

మనుపసుపు అనే మూలిక కూడా రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించే శక్తివంతమైన బయోయాక్టివ్ సమ్మేళనాలను కలిగి ఉంటుంది. దీనిని దారుహరిద్ర అని కూడా పిలుస్తారు. దీనిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. వేపను తీసుకోవడం వల్ల కూడా రక్తంలో చక్కెర స్థాయిలు సహజంగా తగ్గుతాయి. వేపను తీసుకోవడం వల్ల ఇన్సులిన్ గ్రాహక శక్తి పెరుగుతుంది. ఈ విధమైన మూలికలను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ మూలికలను తీసుకునే విషయంలో జాగ్రత్త అవసరమని నిపుణులు తెలియజేస్తున్నారు. ఈ మూలికలను తీసుకోవడం నెమ్మదిగా ప్రారంభించాలి. మొదటగా ఒక్క మూలికను మాత్రమే తీసుకోవాలి. మన సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తాజాగా, పొడిగా లేదా టీ రూపంలో తీసుకోవాలి. వేప, కాకర వంటి వాటిని పరగడుపున తీసుకోవడం వల్ల మంచి ఫలితాలను చూడవచ్చు. డయాబెటిస్ కు ముందు నుండే మందులు వాడే వారు ఈ మూలికలను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. సమతుల్య ఆహారాన్ని తీసుకుంటూ, రోజూ వ్యాయామం చేస్తూ ఈ మూలికలను తీసుకోవడం వల్ల మరిన్ని మంచి ఫలితాలను చూడవచ్చు.

## వెల్లుల్లి రెబ్బలను ఇలా తయారు చేసి తాగండి



వెల్లుల్లిపాయలను మనం రోజూ వంటల్లో వేస్తుంటాం. వీటి వల్ల వంటకాలకు చక్కని రుచి, వాసన వస్తాయి. వెల్లుల్లి వంటకాలకు రుచిని అందించడమే కాదు, మనకు ఆరోగ్య ప్రయోజనాలను కూడా ఇస్తుంది. అందుకనే రోజూ ఉదయం 2 పచ్చి వెల్లుల్లి రెబ్బలను తినాలని చెబుతుంటారు. అయితే వెల్లుల్లి ఘాటుగా ఉంటుంది కనుక దాన్ని తినడం చాలా మందికి కష్టంగా ఉంటుంది. కానీ వెల్లుల్లి రెబ్బలను నీటిలో వేసి మరిగించి డికాషన్‌లా తయారు చేసి తాగవచ్చు. ఇందులోనే అవసరం అనుకుంటే రుచి కోసం కాస్త తేనె కలిపి తాగవచ్చు. ఈ వెల్లుల్లి రెబ్బల టీని రోజుకు ఒక కప్పు మోతాదులో తాగాలి. దీన్ని తాగడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. మనకు కలిగే పలు వ్యాధులను నయం చేయడంలో వెల్లుల్లి ఎంతగానో పనిచేస్తుంది.

## సపోటా పండ్లలో అనేక పోషకాలు



ఆరోగ్యంగా ఉండాలంటే పండ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్యులు చెబుతుంటారు. అందులో భాగంగానే మనకు ఏడాది పొడవునా లభించే పండ్లతోపాటు సీజన్లను బట్టి లభించే పండ్లు కూడా మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయి. అయితే కొన్ని రకాల పండ్లను చాలా మంది తినేందుకు అంతగా ఇష్టపడరు. అలాంటి పండ్లలో సపోటా పండ్లు కూడా ఒకటి. ఇవి తియ్యగా ఉన్నప్పటికీ చాలా మంది వీటిని తినరు. కానీ సపోటా పండ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చు. సపోటా పండ్లలో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. 100 గ్రాముల సపోటా పండ్లను తింటే సుమారుగా 140 క్యాలరీల శక్తి లభిస్తుంది. పిండి పదార్థాలు 34 గ్రాములు, చక్కెరలు 15 గ్రాములు, ఫైబర్ 9 గ్రాములు, ప్రోటీన్లు 1 గ్రాము, కొవ్వులు 2 గ్రాములు లభిస్తాయి.

## మన వంటల్లో చింతకాయలను ఉపయోగిస్తే ఎక్కువ మేలు

చింత పండను మనం వంటల్లో ఉపయోగిస్తూనే ఉంటాం. పప్పు, చారు, సాంబార్ వంటి వంటలతోపాటు పులిహోర, స్వీట్లు, పులుసు వంటి వంటల్లోనూ చింత పండును వేస్తుంటారు. ఇది చాలా పుల్లగా ఉంటుంది కనుక వంటల్లో వేసి పులుపు కోసం ఉపయోగిస్తుంటారు. చింత పండును వేస్తే వంటలకు చక్కని రుచి వస్తుంది. అయితే మీకు తెలుసా..? చింత పండు కన్నా చింత కాయల్లోనే అధిక ఔషధ గుణాలు ఉంటాయని ఆయుర్వేదం చెబుతోంది. మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు చింతకాయల్లో ఉంటాయి. చింతపండు కన్నా చింతకాయలను ఉపయోగిస్తేనే ఎక్కువ మేలు జరుగుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. చింత కాయలను నేరుగా తినలేరు. కానీ వీటిని వంటల్లో ఉపయోగించవచ్చు. వీటితో పచ్చడి, సూప్. కూరలు, పులిహోర వంటివి చేసి తినవచ్చు. దీంతో పలు ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

**అధికంగా విటమిన్ సి..**

చింతపండులో కన్నా చింతకాయల్లోనే విటమిన్ సి అధిక మొత్తంలో ఉంటుంది. అందువల్ల చింత పండు కాస్త తియ్యగా ఉన్నట్లు అనిపిస్తుంది. కానీ కాయ మాత్రం చాలా పుల్లగా ఉంటుంది. అందుకు అందులో ఉండే విటమిన్ సి నే కారణం అని చెప్పవచ్చు. విటమిన్ సి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తుంది. చర్మం ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. మనం తిన్న ఆహారంలో ఉండే ఐరన్‌ను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీంతో రక్తం తయారవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. మహిళలకు చింతకాయలు ఎంతగానో మేలు చేస్తాయి. అందుకనే గర్భంతో ఉన్న మహిళలను చింతకాయలు తినాలని చెబుతుంటారు. వారికి కూడా
ఆ సమయంలో పుల్లగా ఏమైనా తినాలని అనిపిస్తుంది. అందువల్ల
ఆ సమయంలో చింతకాయలను తింటే మేలు జరుగుతుంది.

**మలబద్దకానికి చెక్..**

చింతకాయలను తింటే ఫైబర్ అధికంగా లభిస్తుంది. చింత పండులో ఇది తక్కువగా ఉంటుంది. చింతకాయలను తింటే పేగుల్లో మలం సులభంగా కదులుతుంది. దీంతో మలబద్దకం తగ్గిపోతుంది. చింతకాయల్లో కార్మినేటివ్ గుణాలు ఉంటాయి. ఇవి గ్యాస్, పొట్ట ఉబ్బరాన్ని తగ్గిస్తాయి. చింతకాయలు సహజసిద్ధమైన లాక్సేటివ్‌గా కూడా పనిచేస్తాయి. ఎంతటి తీవ్ర మలబద్దకాన్ని అయినా సరే తగ్గిస్తాయి. ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తాయి. చింతకాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా చింత పండు కన్నా ఆకుపచ్చ రంగులో ఉండే కాయల్లోనే అధికంగా యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. కాయ పండుగా మారే కొద్దీ అందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల శాతం తగ్గుతుంది. చింతకాయల్లో ఉండే ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ సమ్మేళనాలు యాంటీ ఆక్సిడెంట్ల మాదిరిగా పనిచేస్తాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గేలా చేస్తాయి. దీంతో గుండె పోటు, క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**వాపులు, నొప్పులకు..**

చింతకాయల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు కూడా ఉంటాయి. ఇవి శరీరంలోని వాపులను తగ్గిస్తాయి. నొప్పుల నుంచి ఉపశమనం లభించేలా చేస్తాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. చింతకాయల్లో ఉండే సమ్మేళనాలు షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తాయని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. ఈ కాయల్లో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు షుగర్‌ను నియంత్రిస్తాయి. అందువల్ల డయాబెటిస్
ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఈ కాయల్లో యాంటీ మైక్రోబియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. అందువల్ల వీటిని తింటే ఇన్ఫెక్షన్లు తగ్గిపోతాయి. చింతకాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు లివర్‌ను సంరక్షిస్తాయి. ఈ కాయల్లో ప్రొ సయనైడిన్స్ అధికంగా ఉంటాయి. ఇవి లివర్‌లో ఉండే వ్యర్థాలను బయటకు పంపి లివర్‌ను క్లీన్ చేస్తాయి. దీంతో లివర్ పనితీరు మెరుగుపడుతుంది. ఇలా చింతకాయలను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు. అయితే కొందరికి ఈ కాయలను తింటే గ్యాస్ సమస్య రావచ్చు. అలాంటి వారు చింతకాయలకు దూరంగా ఉండాలి.

## కలిపి తీసుకుంటే కష్టమే!



మాంసాహారం, పాలు ఒకేసారి తీసుకోవద్దని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఆయుర్వేదం ప్రకారం మాంసాహారం-పాలను 'విరుద్ధ ఆహారం'గా పిలుస్తారట. అందుకే, ఈ రెండిటినీ కలిపి తీసుకుంటే లేనిపోని ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు. ఇందుకు కారణాలు చెబుతూ.. మాంసం వేడిచేసే గుణాన్ని కలిగి ఉంటుంది. పాలు చలువ చేస్తాయి. కాబట్టి, ఈ రెండూ కలిపి తీసుకున్నప్పుడు జీర్ణ ప్రక్రియలో అసమతుల్యత ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా.. పాలు, మాంసంలో ప్రొటీన్స్, పోషకాలు రెండూ అధిక మొత్తంలో ఉంటాయి. కాబట్టి, ఈ రెండిటినీ కలిపి తీసుకోవడం వల్ల.. జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం చూపుతుందట. కడుపు ఉబ్బరం, అజీర్ణం, కడుపు నొప్పి, వికారం లాంటి సమస్యలు ఎదురవుతాయని అంటున్నారు. కొందరిలో గుండెల్లో మంట కూడా వస్తుందట. కాబట్టి, మాంసాహారం తిన్న తర్వాత కనీసం 2 నుంచి 3 గంటల విరామం ఇచ్చిన తర్వాతే పాలు తాగడం మంచిదని సలహా ఇస్తున్నారు. ఇక చేపలు తిన్న తర్వాత పాలు తాగితే.. తీవ్రమైన అలర్జీలు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

## ఓట్స్ ను రోజూ తింటే కలిగే అద్భుతమైన లాభాలు ఇవే.. మిస్ చేసుకోకుండా తినండి..!

మన ఆరోగ్యానికి మేలు చేసే తృణ ధాన్యాలల్లో ఓట్స్ కూడా ఒకటి. వీటిలో బీటా గ్లూకాన్ అని పిలువబడే కరిగే ఫైబర్ తో పాటు అవెనాంత్రామైడ్స్ అని పిలువబడే యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి. ఓట్స్ ను తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, షుగర్ ను అదుపులో ఉంచడంలో, బరువును తగ్గించడంలో, జీర్ణశక్తిని మెరుగుపరచడంలో ఇలా అనేక రకాలుగా ఓట్స్ మనకు సహాయపడతాయి. వీటిని తరచూ ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఓట్స్ ను ఆహారంగా తీసుకోవడం వల్ల మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



### కొలెస్ట్రాల్ తగ్గేందుకు..

ఓట్స్ ను తీసుకోవడం వల్ల వీటిలో ఉండే ఫైబర్ పేగుల్లో ఉండే కొలెస్ట్రాల్ ను బంధిస్తుంది. తద్వారా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. వీటిని తరచూ తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ దాదాపు 5 నుండి 10 శాతం వరకు తగ్గుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఓట్స్ ను తీసుకోవడం వల్ల కార్బొహైడ్రేట్స్ రక్తంలోకి నెమ్మదిగా ప్రవేశిస్తాయి. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు వెంటనే పెరగకుండా ఉంటాయి. టైప్ 2 డయాబెటిస్ తో బాధపడే వారు ఓట్స్ ను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిల్లో హెచ్చు తగ్గులు రాకుండా ఉంటాయి. అలాగే ఓట్స్ ను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల దీనిలో ఉండే ఫైబర్ ధమనుల ఆరోగ్యానికి మద్దతును ఇస్తుంది. దీంతో సిస్టోలిక్ బిపి అదుపులో ఉంటుంది. ఓట్స్ ను 8 వారాల పాటు తీసుకోవడం వల్ల సిస్టోలిక్ బీపీ 2 నుండి 3 ఎమ్ఎమ్ హెచ్‌జి వరకు తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.

### బరువు తగ్గాలంటే..

అధిక రక్తపోటుతో బాధపడే వారు ఓట్స్ ను రోజూ తీసుకోవడం వల్ల మంచి ఫలితాలను చూడవచ్చు. ఓట్స్ లో ఫైబర్ అధికంగా ఉంటుంది కనుక వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆకలి త్వరగా వేయకుండా ఉంటుంది. దీంతో మనం క్యాలరీలను తక్కువగా తీసుకుంటాం. తద్వారా శరీర బరువు అదుపులో ఉంటుంది. ఓట్స్ ను తీసుకోవడం వల్ల పేగులో మంచి బ్యాక్టీరియా శాతం పెరుగుతుంది. మలబద్దకం సమస్య తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఓట్స్ లో మెగ్నీషియం, ఐరన్, ఫాస్పరస్, జింక్ వంటి పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరానికి కావల్సిన శక్తి లభిస్తుంది. ఇలా అనేక రకాలుగా ఓట్స్ మన ఆరోగ్యానికి మేలు చేస్తాయని వీటిని తీసుకోవడం వల్ల మనం అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయని వైద్యులు తెలియజేస్తున్నారు. విటమిన్ సప్లిమెంట్లు

## షుగర్, అధిక బరువు సమస్యలతో బాధపడుతున్నారా..?

## అయితే ఫైబర్ అధికంగా ఉండే ఈ ఆహారాలను తీసుకోండి..!

డయాబెటిస్ తో బాధపడే వారు ఆహార విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. వారు తీసుకునే ఆహారం రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచేలా, శరీరానికి శక్తిని, పోషకాలను అందించేదిగా ఉండాలి. రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉండాలంటే ఎక్కువగా ఫైబర్ ఉండే ఆహారాలను తీసుకోవాలి. ఫైబర్ ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచవచ్చు. ప్రాసెస్ చేసిన ఆహారాల లాగా కాకుండా ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగకుండా అడ్డుకుంటుంది. గ్లూకోజ్ శోషణ నెమ్మదించేలా చేస్తుంది. ఇక ఫైబర్ లో కూడా కరిగే ఫైబర్, కరగని ఫైబర్ రెండు రకాలు ఉన్నాయి. డయాబెటిస్ ఉన్న వారు రోజుకు 22 నుండి 35 గ్రాముల ఫైబర్ ను తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఫైబర్ ను తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది, శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారు తీసుకోదగిన ఫైబర్ అధికంగా ఉండే ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### అవకాడో, బెర్రీ పండ్లు..

డయాబెటిస్ తో బాధపడే వారు అవకాడోను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. దాదాపు 100గ్రాముల అవకాడోలో 6.7 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఫైబర్ తో పాటు అవకాడోలో ఆరోగ్యకరమైన మోనోశాచురేటెడ్ కొవ్వులు కూడా ఉంటాయి. ఈ కొవ్వులు ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచడంలో, గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో ఎంతో సహాయపడతాయి. మధుమేహంతో బాధపడే వారికి అవకాడో ఒక మంచి పండు అని చెప్పవచ్చు. స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ వంటి పండ్లల్లో చక్కెరలు తక్కువగా ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. 100గ్రాముల రాస్ప్బెర్రీల్లో 6.5 గ్రాముల ఫైబర్ ఉంటుంది. వీటిని



తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. అదేవిధంగా పియర్స్ ను తీసుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. వీటిని తొక్కతో తీసుకోవడం వల్ల మనం మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చు. మధ్యస్థంగా ఉండే ఒక పియర్ పండును తినడం వల్ల దాదాపు 6 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. మధుమేహ నిర్వహణకు ఈ పండు ఎంతో సహాయపడుతుందని వైద్యులు చెబుతున్నారు.

### బ్రోకలీ, పచ్చి బఠానీలు..

ఇక డయాబెటిస్ తో బాధపడే వారు బ్రోకలీని కూడా తీసుకోవచ్చు. ఒక కప్పు బ్రోకలీలో 2.2 గ్రాముల ఫైబర్ ఉంటుంది. దీనిలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు కూడా అధికంగా ఉంటాయి. క్యాలరీలు తక్కువగా ఉంటాయి. కనుక బ్రోకలీని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయి, శరీరానికి కావల్సిన పోషకాలు లభిస్తాయి. పచ్చిబఠాణీల్లో కూడా ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఒక కప్పు పచ్చిబఠాణీలలో దాదాపు 8.8 గ్రాముల ఫైబర్ ఉంటుంది. కనుక భోజనంలో వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా ఉంటాయి. అదే విధంగా డయాబెటిస్ ఉన్న వారు ఓట్స్ ను, బార్లీని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. వీటిలో కరిగే ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది గ్లూకోజ్ శోషణను, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఒక కప్పు ఉడికించిన బార్లీలో 6 గ్రాములు, అరకప్పు ఓట్స్ లో 4 గ్రాముల ఫైబర్ ఉంటుంది. డయాబెటిస్ తో బాధపడే వారు ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగకుండా ఉంటాయి. చక్కెర స్థాయిలల్లో వచ్చే హెచ్చుతగ్గులు రాకుండా నివారించవచ్చు. ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల శరీరానికి కావల్సిన పోషకాలు లభిస్తాయి. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంతో పాటు మొత్తం శరీర ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు.

## చిలగడదుంపలను ఇలా తింటున్నారా..?

## అయితే షుగర్ లెవల్స్ పెరుగుతాయి జాగ్రత్త..!

మన ఆరోగ్యానికి మేలు చేసే దుంప జాతి ఆహారాల్లో చిలగడదుంపలు కూడా ఒకటి. ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి సహజంగానే తీపి రుచిని కలిగి ఉంటాయి. వీటిలో విటమిన్ ఎ, విటమిన్ సి, మాంగనీస్ వంటి పోషకాలతో పాటు ఫైబర్ కూడా అధికంగా ఉంటుంది. చిలగడదుంపలను తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణ సమస్యలు తగ్గుతాయి. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం కూడా తక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వీటిని కాల్చుకుని, వేయించి, ఉడికించి అనేక రకాలుగా ఆహారంగా తీసుకుంటూ ఉంటారు. అయితే వీటిని వండే విధానమే రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తుందని నిపుణులు తెలియజేస్తున్నారు. వాటిని ఎక్కువగా ప్రాసెసింగ్ చేయడంతో పాటు కొన్ని వంట పద్ధతుల కారణంగా చిలగడదుంపల గ్లైసెమిక్ ఇండెక్స్ పెరుగుతుందని అలాంటి సమయంలో వాటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయని నిపుణులు సూచిస్తున్నారు.



### వేయిస్తే చక్కెరతో సమానం..

చిలగడదుంపను వండే విధానం గ్లైసెమిక్ ఇండెక్స్ ను ఏవిధంగా ప్రభావితం చేస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం. చిలగడదుంపను కాల్చి వంట చేస్తూ ఉంటారు. తొక్క తీసి కాల్చడం వల్ల దీని గ్లైసెమిక్ ఇండెక్స్ 94 వరకు చేరుకుంటుంది. తద్వారా ఇవి అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ ఆహారాల్లో చేరిపోతాయి. కాల్చిన చిలగడదుంపలతో పాటు తెల్లబియ్యం, బంగాళాదుంపలు వంటి వాటిని కలిపి తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు మరింత పెరుగుతాయి. కాల్చిన చిలగడదుంపలు ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికీ షుగర్ వ్యాధి గ్రస్తులు వీటిని కాల్చి తీసుకోకపోవడమే మంచిది. అలాగే చిలగడదుంపలను వేయించడం కూడా మంచిది కాదు. వేయించడం వల్ల వాటిలో ఉండే స్టార్చ్ నిర్మాణం మారుతుంది. వేయించడం వల్ల ఇవి చక్కెరతో సమానంగా మారిపోతాయి. అంతేకాకుండా వేయించడం వల్ల నూనె కారణంగా వచ్చే అధిక క్యాలరీలు కూడా శరీరంలోకి వెళ్తాయి. దీంతో ఆరోగ్యప్రయోజనాలు తగ్గుతాయి. రక్తంలో చక్కెర, బరువు పెరిగే అంశాలను దృష్టిలో ఉంచుకుని వీటిని వేయించి తీసుకోకపోవడమే మంచిది.

### ఉడికించి తినడం మంచిది..

చిలగడదుంపలను ఉడికించి తీసుకోవడం అన్నింటి కంటే మంచి పద్దతని నిపుణులు చెబుతున్నారు. ఉడికించడం వల్ల చిలగడదుంపలు సాధారణం నుండి మధ్యస్థ గ్లైసెమిక్ సూచికలోకి వస్తాయి. ఇవి గ్లూకోజ్ స్థాయిలను కూడా ఎక్కువగా ప్రభావితం చేయవు. ఎక్కువ సమయం ఉడికించడం వల్ల వాటి స్టార్చ్ నిర్మాణంలో మార్పులు వస్తాయి. అలాగే ఉడికించడం వల్ల ఇవి నెమ్మదిగా జీర్ణమవుతాయి. రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. కనుక షుగర్ వ్యాధి గ్రస్తులతో పాటు ఇతరులు కూడా వీటిని ఉడికించి తీసుకోవడమే మంచిదని నిపుణులు చెబుతున్నారు.
అలాగే వీటిని బేక్ చేసి కూడా తీసుకోవచ్చు. బేక్ చేయడం వల్ల ఇవి మధ్యస్థ గ్లైసెమిక్ సూచికలోకి వస్తాయి. వీటిని ఫైబర్ అధికంగా ఉండే కూరగాయలు లేదా ప్రోటీన్ తో కలిపి తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగకుండా ఉంటాయి. చిలగడదుంపలు ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికి వీటిని వండే విధానంలో వచ్చే తేడాల వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయని వైద్యులు చెబుతున్నారు. చిలగడదుంపలను కాల్చి, వేయించి తీసుకోవడానికి బదులుగా ఉడికించి, బేక్ చేసి తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి మరింత మేలు కలుగుతుందని వారు సూచిస్తున్నారు.



## జాగ్రత్త మహిళా..!

గుంట నక్కలు ముసుగేసుకుని మన
చుట్టు తిరుగుతు మాయ మాటలు
చెప్పి నిన్ను మాయం చేస్తారు జాగ్రత్త
మహిళా..!
మహిళ చిరునవ్వుల చాటున
కన్నీటిచుక్కలు ఎవరికి తెలుసు...!
బడికి వెళ్లే ఆడ పిల్లపై నీ వెయ్యి
కన్నులు వేసి ఉంచు మహిళా..!
రెప్పపాటు ఆదమరచినావో
డేగ లాగా తన్నుకొని పోతారు జాగ్రత్త
మహిళా..!
మహిళ చిరునవ్వుల చాటున
కన్నీటిచుక్కలు ఎవరికి తెలుసు...!
పొలం పనుల కోసం పొయ్యేటప్పుడు
బుడ్డదాన్ని వెంట తీసుకునిపో...
మరచి పోయినావో కామాంధుల
కాటుకు బలై పోతుంది జాగ్రత్త
మహిళా..!
మహిళ చిరునవ్వుల చాటున
కన్నీటిచుక్కలు ఎవరికి తెలుసు...!
కూలి నాలికి పొయ్యేటప్పుడు చీడ
పురుగుల బారిన పడకుండా
నిండు వస్త్రధారణతో వెళ్లు...
మరచి పోయినావో చుట్టు ముట్టి
చిత్రవధ చేస్తారు జాగ్రత్త మహిళా..!
మహిళ చిరునవ్వుల చాటున
కన్నీటి చుక్కలు ఎవరికి తెలుసు...!
అంతా నావాళ్ళే అని గుడ్డిగా నమ్మకు
మహిళా..!
నీ వెనక గోతులు తీసేది నీ వాళ్ళే అని
తెలుసుకో మహిళా..!
మహిళ చిరునవ్వుల చాటున
కన్నీటి చుక్కలు ఎవరికి తెలుసు...!
సమాజంలో ఉన్న కొంత మంది
గురించి మాత్రమే వారు మంచిగా
మారుతారు అని ఆశిస్తు...
తరలిపో తరలిపో.. చీకటి నుంచి వెలుగుకు తరలిపో.. కుందేలువి కావు.. పులిలా మారిపో.. వెంటాడే ఒడిదుడుకుల మృగాలతో యుద్ధానికి తరలిపో..." ఓ మహిళా మీకివే మా వందనాలు. కంటిపాపలా కాపాడే 'స్త్రీమూర్తి'కి వందనాలు



శ్రీమతి మంజుల పత్తిపాటి
(కవయిత్రి).
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్
కమిటీ డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం
చరవాణి 9347042218.

# కళ్ళ ఎదుటే కబ్జా.. అధికారులకు కనిపించడం లేదా?

## జహీరాబాద్లో బడా భూస్వామి 'పక్కా స్కెచ్'





జహీరాబాద్ నేటి ధాత్రి:
పట్టణ నడిబొడ్డున విలువైన ప్రభుత్వ భూమిపై కబ్జాదారుల కన్ను పడింది. సుమారు రూ. 50 కోట్ల విలువైన పాల శీత లీకరణ కేంద్రం (వీజజ) స్థలాన్ని హస్తగతం చేసుకునేందుకు ఓ బడా భూస్వామి సాగించిన ఆక్రమణ పర్వం ఇప్పుడు స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది. అధికారుల అండదండలతోనే ఈ దందా సాగుతోం దని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**దశాబ్ద కాలంగా కబ్జా యత్నాలు**

సర్వే నంబర్ 147లో 1973లో ఏర్పాటు చేసిన ఈ పాల శీతలీకరణ కేంద్రానికి మొత్తం 3.20 ఎకరాల భూమి ఉంది. దీనికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 146లోని తన భూమిని సాకుగా చూపిస్తూ, ఒక వ్యక్తి గత పదేళ్లుగా ఈ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిం చేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో (2013లో) ప్రజల నిరసనతో, 2018లో మున్సిపల్
అధికారుల జోక్యంతో ఈ కబ్జా ప్రయత్నాలు విఫలమయ్యాయి. కానీ, ఇప్పుడు పరిస్థితి తారుమారైంది అధికారులు మౌనం.. 'డెయిరీ' స్కామ్ ఆరోపణలు గతంలో సర్వే నిర్వహించి ఇది ప్రభుత్వ భూమేనని తేల్చిన యంత్రాంగం, ఇప్పుడు మాత్రం కళ్లు మూసుకున్నట్లు వ్యవహరిస్తోంది. సదరు కబ్జాదారుడు ఏ కంగా ప్రభుత్వ స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం వెనుక భారీ 'డెయిరీ' స్కామ్ ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రజల ఆగ్రహం: '**

ఎన్నికల విధుల పేరుతో అధికా రులు బాధ్యత నుండి తప్పించుకుంటున్నారు. ఎంసీ సీ మేనేజర్ డేవిడ్ మరియు ఇతర ఉన్నతాధికారులు కబ్జాదారులతో కుమ్మక్కయ్యారు. వారి సహకారంతో నే అర్ధరాత్రి పూట ఫెన్సింగ్ పనులు పూర్తయ్యాయి.
మున్సిపల్ చైర్మన్ స్పందించాలి!
కోట్ల విలువైన ప్రజా ఆస్తులు ప్రైవేటు వ్యక్తుల పరం అవుతుంటే చూస్తూ ఊరుకోబోమని రైతాంగం హెచ్చరించింది. మున్సిపల్ చైర్మన్ వెంటనే స్పందించి, కబ్జాకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకో వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి భూమిని కాపాడకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని రైతులు స్పష్టం చేశారు



# మృతి చెందిన సభ్యులకు అసెంబ్లీ సంతాపం

అమరావతి, నేటిధాత్రి:
మంగళవారం శాసనసభలో పలువురు దివంగత నేతలకకు నివాళి అర్పించారు. ఇటీవల మరణించిన పలువురు మాజీ శాసనసభ్యులకు సభ సంతాపం తెలియజేసింది. గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్ రెడ్డి, విజయవాడ వెస్ట్ మాజీ ఎమ్మెల్యే ఆసిఫ్ పాషా, రైల్వే కోడూరు మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర ప్రసాద్, పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే గంటె సుమన్, శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండు అప్పల సూర్యనారాయణ, తాడేపల్లిగూడెం మాజీ ఎమ్మెల్యే ఈలి వరలక్ష్మి, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే రత్నాబాయి మృతి పట్ల సభ సంతాపం తెలిపింది. ప్రజా జీవితంలో వారు చేసిన సేవలను సభకు వివరించారు స్పీకర్ అయ్యన్నపాత్రుడు. మాజీ శాసనసభ్యుల మృతికి గౌరవసూచకంగా సభ్యులందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.



# ప్రజల పాలిట పాలకూట విషం



## కల్తీపాలు కుంభకోణం బహిర్గతం.. ఐదుగురు మృతి పలువురు ఆస్పత్రిలో



- పాలలో విషం... రాజమహేంద్రవరంలో ఐదుగురు మృతి
- కాలకూటంగా మారిన పాలు - ప్రజల్లో భయం
- యూరియా కల్తీ పాల కుంభకోణం బహిర్గతం
- కల్తీ డెయిరీ దందా బట్టబయలు -ప్రాణాలు బలిగొన్న నిర్లక్ష్యం
- పాలు కాదు... విషం తాగుతున్న ప్రజలు
- కృత్రిమ పాల మాఫియా పంజా - చిన్నారులు, వృద్ధులు బలి
- ఫుడ్ సేఫ్టీ వైఫల్యం -పాల కల్తీతో విషాదం
- రాజమహేంద్రవరాన్ని కుదిపేసిన కల్తీ పాల ఘటన
- లాభాల కోసం ప్రాణాలతో ఆట - పాలలో రసాయనాలు
- డెయిరీ మోసం... కిడ్నీ ఫెయిల్యూర్ వరకు ప్రమాదం
- యూరియా, ఫార్మలిన్ కలిపిన కృత్రిమ పాలు
- ఐదుగురు మృతి, పలువురు వెంటిలేటర్పై
- డెయిరీ నిర్వాహకుడు అదుపులోకి
- రూ.10 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించిన ప్రభుత్వం
- కఠిన చర్యలు కోరుతున్న ప్రజలు
- పాలు తాగితే పోషణ... ఇప్పుడు ప్రమాదం
- ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం నిఘా లేక కల్తీ రాజ్యం
- పాడి రంగంలో ప్రైవేట్ దందా పెరుగుతోంది

డెస్క్, నేటిధాత్రి:
రాజమహేంద్రవరం నగర శివారులో కల్తీ పాలు తాగి ఐదుగురు మృతి చెందడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. మరికొందరు తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారిలో ఇద్దరు వెంటిలేటర్పై ఉండగా, ఎనిమిది మంది తీవ్ర స్థితిలో ఉన్నారు. పాలు తాగిన వారిలో వృద్ధులు, చిన్నారులే అధికంగా ఉండటం విషాదకరం.
ప్రాథమిక విచారణలో కోరుకొండ మండలం పర్సాపురం గ్రామానికి చెందిన వరలక్ష్మి డెయిరీ నుంచి సరఫరా అయిన కల్తీ పాలు కారణమని అధికారులు గుర్తించారు. డెయిరీ నిర్వాహకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ కొనసాగిస్తున్నారు.

**యూరియా, రసాయనాలతో కృత్రిమ పాలు**

పాల దిగుబడి పెంచేందుకు, లాభాల కోసం కొందరు వ్యాపారులు యూరియా, బియ్యం పిండి, సోడా, గ్లూకోజ్, సోడియం హైడ్రాక్సైడ్, గంజి పౌడర్, జంతువుల కొవ్వు, పాల పొడి వంటి పదార్థాలను కలిపి కృత్రిమ పాలను తయారు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రెండు లీటర్ల పాలలో రసాయనాలు కలిపి ఐదు నుంచి ఆరు లీటర్లుగా తయారు చేస్తున్నారని తెలుస్తోంది.
నిల్వ కోసం ఫార్మలిన్ వంటి ప్రమాదకర రసాయనాలు కలపడం వల్ల జీర్ణకోశ, కాలేయ, మూత్రపిండ సమస్యలు వస్తున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అనూరియా (మూత్ర విసర్జన ఆగిపోవడం), కిడ్నీ ఫెయిల్యూర్ వంటి ప్రమాదకర పరిస్థితులు నమోదయ్యాయి.

**పర్యవేక్షణ ఎక్కడ?**

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు కేవలం దాడులకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. అనుమతి లేకుండా డెయిరీలు నడుస్తున్నప్పటికీ నియంత్రణ లేకపోవడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. సహకార రంగం బలహీనపడడంతో ప్రైవేట్ డెయిరీల ఆధిపత్యం పెరిగి, అనారోగ్య పోటీ కారణంగా కల్తీ పెరిగిందని నిపుణులు అంటున్నారు.

**ప్రభుత్వ స్పందన**

రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించింది. మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని తెలిపింది.

**కఠిన చర్యలు అవసరం**

పాల సరఫరా వ్యవస్థపై పూర్తి నిఘా, పాడిపశువుల నమోదు, క్రమబద్ధ తనిఖీలు, కఠిన శిక్షలు అమలు చేయకపోతే మరిన్ని ఘటనలు జరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
పాలు ప్రజల నిత్యావసర ఆహారం కావడంతో, వాటి స్వచ్ఛతపై ప్రభుత్వం అత్యవసర చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

గుంటూరు ఛానల్ ఆధునీకరణకు

# 369 కోట్లు




అమరావతి, నేటిధాత్రి:
గుంటూరు ఛానల్ ఆధునీకరణకు 369 కోట్ల రూపాయలతో అంచనాలు రూపొందించారని నీటిపారుదల శ్శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ అంచనాల అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.370 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీఓ జారీ చేసిందన్నారు. అయితే.. 2021లో ఆ నిధులను రద్దుచేస్తూ కొత్త అంచనాలు రూపొందించాలని నిర్ణయించినట్లు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.369 కోట్లతో పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. గుంటూరు ఛానల్ ఆధునీకరణపై ఏపీ శాసనమండలిలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ప్రశ్న లేవనెత్తారు. గుంటూరు ఛానల్ సంబంధిత కట్టలు దెబ్బతిన్నాయని తెలిపారు. మంగళగిరి పట్టణం నుంచి మురుగు నీరంతా ఈ ఛానల్లో కలుస్తోందని చెప్పారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఈ ఛానల్ మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గ పరిధిలో ఉండటంతో ఆయనే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హనుమంతరావు ప్రశ్నపై నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానిమస్తూ.. ఛానల్ పొడిగింపునకు రూ.285 కోట్లు విడుదల చేశామని మంత్రి నిమ్మల వెల్లడించారు. మంగళగిరిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గుంటూరు ఛానల్లో మురుగు కలవకుండా చూడాలని, దీనిపై మంత్రి నారా లోకేశ్ కూడా స్పందించి చర్యలు తీసుకోవాలని ఆలపాటి రాజా కోరారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. మొదటి దశ కింద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుచేయాలని నిర్ణయించామని తెలిపారు.

## కొండ ప్రాంతాల్లో రహదారుకలు

# అడవితల్లి బాట

- రూ.1,077 కోట్లతో ఈ కార్యక్రమం అమలు
- అసెంబ్లీలో ప్రశ్నకు మంత్రి నాదెండ్ల సమాధానం



అమరావతి, నేటిధాత్రి:
గిరిజన గ్రామాలు, కొండ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాల కోసం 'అడవితల్లి బాట' కార్యక్రమం చేపట్టినట్లు అసెంబ్లీలో మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రూ.1,077 కోట్లతో ఈ కార్యక్రమం అమలవుతోందని.. దీని ద్వారా సుమారు 4 వేల కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం జరుగుతోందని మంత్రి వివరించారు. ఏపీ అసెంబ్లీ సమావేశాలు తొమ్మిదో రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఈ సందర్భంగా అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ 'అడవితల్లి బాట' కార్యక్రమంపై ప్రశ్న లేవనెత్తారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సభలో లేకపోవడంతో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమాధానం ఇచ్చారు. మన్యం ప్రాంతంలో సరైన రోడ్లు లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడేవారని మంత్రి అన్నారు. అనారోగ్యానికి గురైనప్పుడు వైద్యం కోసం డోలీల ద్వారా రోగులను తరలించాల్సి వచ్చేదని చెప్పుకొచ్చారు. ఈ పరిస్థితిని మార్చాలనే ఉద్దేశంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 'అడవితల్లి బాట' కార్యక్రమాన్ని చేపట్టారని నాదెండ్ల మనోహర్ వివరించారు. అలాగే ఒడిశా సరిహద్దులోని కొటియా గ్రామాల సమస్యను కొణతాల రామకృష్ణ సభలో ప్రస్తావించారు. ఈ గ్రామాల ప్రజలు రెండు రాష్ట్రాల్లో ఓటుహక్కును కలిగి ఉన్నారన్నారు. అయితే.. ఏపీ అధికారులు అక్కడికి వెళ్లకుండా ఒడిశా పోలీసులు అడ్డుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ సమస్యపై ప్రభుత్వం జోక్యం చేసుకుని త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు.

# పర్యాటకంగా విశాఖలో పలు అభివృద్ధి పనులు

- రూ.8,650 కోట్ల పెట్టుబడులతో 50 ఒప్పందాలు
- అసెంబ్లీలో మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడి

అమరావతి,నేటిధాత్రి:
ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో విశాఖ నగరం కీర్తి కిరీటంగా నిలుస్తుందని మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా విశాఖపట్నం దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్ వంశీ కృష్ణ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాల అభివృద్ధికి రూ.8,650 కోట్ల పెట్టుబడులతో 50 ఎంవోయూ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు మంత్రి తెలిపారు. హబ్ అండ్ స్పోక్ మోడల్లో విశాఖను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ÷ఖ-ప్లేన్, క్రూజ్ సర్క్యూట్, హెలీ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మంత్రి దుర్గేశ్ చెప్పారు. విశాఖను అడ్వెంచర్ , యాంకర్ హబ్గా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ప్రసాద్ స్కీమ్ కింద సింహాచలం దేవస్థానానికి రూ.54.04 కోట్లు, స్వదేశీ దర్శన్ 2.0 కింద బొర్రా గుహల అభివృద్ధికి రూ.28.87 కోట్లు మంజూరు చేసి పనులు వేగవంతం చేశామని వివరించారు. రుషికొండ, తిమ్మాపురం, సాగర్ నగర్ బీచ్, గోస్తనీ బ్యాక్ వాటర్స్లో స్కూబా డైవింగ్, పారా మోటరింగ్ వంటి 10 రకాల జలక్రీడలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడంతో మరింత ఊతం వచ్చిందని మంత్రి అన్నారు. క్యారవాన్ పాలసీలో భాగంగా అన్ని ప్రాంతాల్లో క్యారవాన్ పార్కుల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. విశాఖలో 'హాప్-ఆన్, హాప్-ఆఫ్ డబుల్ డెక్కర్ బస్సులు' సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. హోమ్ స్టే పాలసీ, బ్రెడ్ అండ్ బ్రేక్ఫాస్ట్ విధానంతో 490 హోమ్ స్టేలు ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. 'సీఆర్జెడ్ 19' అమల్లోకి వస్తే పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణాలకు ఉన్న అడ్డంకులు తొలగిపోతాయన్నారు. 2019-24 కాలంలో కుదేలైన పర్యాటక రంగాన్ని కూటమి ప్రభుత్వం పట్టాలెక్కించిందని ఆయన వివరించారు. నూతన పర్యాటక పాలసీ 2024-29తో విస్తృతంగా పెట్టుబడులు వచ్చాయన్నారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలను పర్యాటక హబ్లుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి దుర్గేశ్ స్పష్టం చేశారు.

# పోలవరం ప్రాంతంలో మరోమారు పులికలకలం

## అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన అటవీ అధికారులు

రాజమండ్రి, నేటిధాత్రి:
పోలవరం జిల్లాలో మరోసారి పులి సంచారం కలకలం రేపుతోంది. రంపచోడవరం మండలం అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇదే పులి సంచరించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఈ పులిని అటవీ అధికారులు ఎంతో చాకచక్యంగా బంధించి విశాఖపట్నం జూకు తరలించారు. అక్కడ చికిత్స అందించిన తర్వాత, ప్రత్యేక కమిటీ నిర్ణయం మేరకు పాపికొండలు అభయారణ్యంలో వదిలిపెట్టి.. ఆ వీడియోలను మీడియాకు విడుదల చేశారు. అయితే, ఇదే పులి గత రెండు రోజులుగా మారేడుమిల్లి మండలం అటవీ ప్రాంతంలో కనిపించింది. కాకవాడ, దారగూడెం, నూరుపూడి, సీమగండి, రామన్నవలస, తుర్రూరు, దేవరపల్లి, సున్నంపాడు గ్రామాల సరిహద్దుల్లో సంచరించినట్లు సమాచారం. ప్రస్తుతం రంపచోడవరం మండలం లోని గెద్దాడ, చిలకమామిడి, బూసిగూడెం అటవీ ప్రాంతాల్లో తిరుగుతున్నట్టు అటవీ శాఖ అధికారులు తెలిపారు. పులి సంచారంతో అటవీశాఖ నిఘా పెంచింది. పులి కదలికలపై నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. పులి సంచారం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి సమయంలో ఒంటరిగా బయటకు వెళ్లవద్దని అటవీ అధికారులు హెచ్చరించారు.

Printed, Published & owned by Katta Raghavender Rao, Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail : netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999